



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com


# విశాఖ సమాచారమ్

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 145 విశాఖపట్నం, 14 మార్చి 2026 శనివారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00

## ఏపీ కేబినెట్ భేటీ.. పవన్ సహా ఆరుగురు మంత్రుల డుమ్మా!



**విజయవాడ, విశాఖ సమాచారమ్, మార్చి 13 :** సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ కేబినెట్ సమావేశానికి మంత్రుల గైర్హాజరు చర్చాంశనీయంగా మారింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహా ఆరుగురు మంత్రులు హాజరు కాకపోవడం విశేషం

శుక్రవారం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం జరిగింది. రాష్ట్ర పరిపాలన, అభివృద్ధి, అమరావతి రాజధాని పురోగతి వంటి కీలక అంశాలపై చంద్రబాబు చర్చించారు. అయితే, ఈ సమావేశానికి పలువురు మంత్రులు డుమ్మా కొట్టారు.

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ సమావేశానికి హాజరు కాలేదు. రెండు రోజుల కలెక్టర్ల సదస్సుకు కూడా పవన్ హాజరు కాకపోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. నాదెండ్ల మనోహర్ సమావేశానికి దూరంగా ఉన్నారు. అనారోగ్య కారణంగా హోమ్ మంత్రి అనిత, మంత్రి టీజీ భరత్, మంత్రి గొట్టిపాటి రవి.. కుటుంబ కార్యక్రమం కారణంగా మరో మంత్రి ఫరూక్ హాజరు కాలేదని అధికార వర్గాలు వెల్లడించాయి.

మొత్తం ఆరుగురు మంత్రులు గైర్హాజరు కావడంతో ఈ కేబినెట్ సమావేశం చుట్టూ రాజకీయ చర్చలు వేడెక్కాయి. ముఖ్యంగా పవన్ వరుసగా రెండు కీలక సమావేశాలకు హాజరు కాకపోవడంపై వివిధ వర్గాల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే అధికార వర్గాలు దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

# పలు అజెండా అంశాలకు గ్రీన్‌సిగ్నల్

- మహిళల కోసం క్రెచ్ సౌకర్యాలతో హాస్టళ్లు
- తిరుపతి, విజయవాడ, విశాఖ అప్పీల్ కార్యాలయాల పరిధిపై నిర్ణయం
- ఏపీ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ చట్ట గెజిట్‌కు ఆమోదం
- పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఆర్డర్‌లో పోలవరం, మార్కాపురం జిల్లాలు చేర్చే ప్రతిపాదనలను కేంద్రానికి పంపే అజెండాకు అమోదం
- పోలవరం ప్రాజెక్ట్ హెడ్ వర్క్స్‌లో అదనపు

**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 13 :** ఎపి క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. 25 అజెండా అంశాలపై శుక్రవారం సమావేశమైన మంత్రులు.. మూడు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర రాజధాని అభివృద్ధి, నిరుద్యోగులకు ఉపాధి కల్పన, జలవనరులు, వ్యవసాయం, పరిశ్రమల ఏర్పాటుపై కీలక నిర్ణయం తీసుకున్నారు. సీఆర్డీఏ నిర్ణయాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సచివాలయం, హెచ్వోడీ టవర్ల నిర్మాణానికి కావాల్సిన అనుమతులు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే అమరావతిలో పలు పరిశ్రమలకు భూములు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 300 మంది హెడ్ కానిస్టేబుళ్ల పోస్టుల అప్ గ్రేడ్ ప్రతిపాదనపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు.



**క్యాబినెట్ నిర్ణయాలేవంటే ...**

- రూ.119 కోట్ల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం
- రాజధాని అమరావతిలో వివిధ సంస్థలకు భూకేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదనలకు ఆమోదం
- 300 మంది హెడ్ కానిస్టేబుల్ పోస్టులను రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులుగా అప్‌గ్రేడ్ ప్రతిపాదనకు ఆమోదం
- చిన్న పరిశ్రమలకు ఊతమిస్తూ దాదాపు 17వేలమందికి ఉపాధి లభించేలా చర్యలు
- 3,500 సూక్ష్మ పరిశ్రమలకు రూ.300 కోట్లు ఆర్థిక వనరులు కల్పించే ప్రతిపాదనలకు ఆమోదం
- ఎఫ్ఆర్ఏ పట్టాదారులకు రాయితీలు కల్పించే ప్రతిపాదనలకు ఆమోదం
- మిషన్ శక్తి కింద ' సఖీ నివాస్' పేరుతో పనిచేసే
- గ్రానైట్ కొనుగోలు, లైనింగ్ పనులకు రూ.23.47 కోట్లు కేటాయింపు
- పోలవరం ప్యాకేజ్-64 పనులకు రూ.24.51 కోట్లు మంజూరుకు అనుమతి
- ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్‌లో అత్యవసర మరమ్మతు పనులకు నిధుల మంజూరు.

## వంటగ్యాస్ కొరతపై కేంద్రం కీలక ప్రకటన




**ఢిల్లీ:** వంటగ్యాస్ కొరతపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. భారత్‌లో గ్యాస్ సంక్షోభం లేదని పెట్రోలియం శాఖ స్పష్టం చేసింది. ప్యానిక్ బుకింగ్స్ వద్దని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ కోరారు. అవసరం లేకున్నా ఆందోళనతో గ్యాస్ బుక్ చేయొద్దన్నారు. బ్లాక్ మార్కెట్‌పై చర్యలు తీసుకుంటున్నామన్న పెట్రోలియం శాఖ.. గ్యాస్ అందుబాటులో ఉందని.. ఆందోళన అక్కర్లేదని పేర్కొంది. దేశంలో తరువాయి 2లో..

## అలా అయితే మహిళలకు ఉద్యోగాలు కష్టమే : సుప్రీం కోర్టు

**ఢిల్లీ:** మహిళల పీరియడ్ లీవ్‌కు సంబంధించి సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళలకు రుతుస్రావం సమయంలో సెలవులు తప్పనిసరి చేస్తే ఏ కంపెనీలు వారికి ఉద్యోగాలు ఇవ్వడానికి మొగ్గు చూపవని సుప్రీం కోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. రుతుస్రావం సమయంలో మహిళలకు తప్పనిసరిగా సెలవులు ఇవ్వాలని నమోదైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈ రోజు శుక్రవారం విచారించింది.

మహిళల సహజ రుతుస్రావం సమయంలో విద్యార్థినిలకు, ఉద్యోగస్థులకు తప్పనిసరిగా సెలవులు మంజూరు చేయాలని లాయర్ శైలేంద్ర మణి త్రిపాఠి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ విధంగా అన్ని రాష్ట్రాలకు ఆదేశాలివ్వాలని కోర్టును కోరారు. ఆ పిటిషన్‌పై దేశ అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది.

'పీరియడ్ సమస్యపై, దాని సున్నితత్వంపై అవగాహన కల్పించడం వేరు. రుతుక్రమం సమయంలో సెలవులు తప్పనిసరి అనిచట్టం చేస్తే మహిళలకే నష్టకరంగా మారవచ్చు. వారిని ఎవరూ ఉద్యోగంలోకి తీసుకోరు. గవర్నమెంట్ ఉద్యోగాలు, జ్యూడీషియరీ



జాబ్స్ ఎందులోనూ వారికి చోటు ఉండదు. కంపెనీల మనస్థత్వం మీకు తెలియదు' అని అన్నారు. అయితే దీనిపై వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఇదే అంశంపై సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఆర్టికల్ 21 ప్రకారం ఆడపిల్లలకు గౌరవంగా జీవించే హక్కు తరువాయి 2లో..



## ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత

**హైదరాబాద్:** ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో ఆయన్ను నిమ్స్‌లో చేర్చగా.. ఈ రోజు (శుక్రవారం, మార్చి 13వ తేదీ) చికిత్స పొందుతూ కన్నుమూశారు.

హెచ్‌జే దొర.. ఆయన పోలీస్ శాఖలో విశిష్ట సేవలు అందించి, క్రమశిక్షణతో పాటు ప్రజల భద్రత కోసం కృషి చేశారు. దశాబ్దాలపాటు పోలీస్ వ్యవస్థలో కీలక పదవుల్లో పనిచేసి, అనేక సంస్కరణలకు మార్గదర్శకుడయ్యారు. ప్రధానంగా గ్రేహౌండ్స్ బలోపేతానికి హెచ్‌జే దొర విశేషంగా కృషి చేశారు.

ఆయన మరణం రాష్ట్రానికి, పోలీస్ శాఖకు పెద్ద నష్టం అని పలువురు భావిస్తున్నారు. సహచరులు, శిష్యులు ఆయనను క్రమశిక్షణా ప్రియుడిగా, నిబద్ధత కలిగిన అధికారిగా గుర్తుచేసుకుంటున్నారు.

## ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ బాధ్యతల స్వీకరణ



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 13 :** ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీ హైకోర్టు మొదటి కోర్టు హాల్ లో న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ చేత హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రమాణ స్వీకారం చేయించారు. జస్టిస్ లీసా గిల్ పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తూ ఏపీ హైకోర్టుకు బదిలీపై వచ్చారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ తరువాయి 2లో..

## తీవ్ర గాయాలతో కోమాలో ఖమేనీ


### సంచలనంగా బ్రిటీష్ మీడియా కథనాలు



**ఇరాన్ :** ఇరాన్ కొత్త అత్యున్నత నాయకుడు మోజ్తబా ఖమేనీ ఆరోగ్య పరిస్థితిపైపలు అనుమానాలు హల్‌చల్ చేస్తున్నాయి. అంతర్జాతీయ మీడియాలో వస్తున్న భిన్నమైన కథనాల ప్రకారం శత్రు పక్షం దాడిలో మోజ్తాబా తరువాయి 2లో..

## సీఈఓ పదవికి శంతను వీడ్కోలు కొత్త బాస్ ఎవరు?

**అమెరికా :** అమెరికాకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ అడోబ్‌లో.. దాదాపు రెండు దశాబ్దాలుగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా కొనసాగుతోన్న శంతను నారాయణ్ ఆ పదవికి రాజీనామా చేయనున్నట్లు కొన్ని వదంతులు వినిపించాయి. దీనిపై కంపెనీ స్పందిస్తూ.. కొత్త సీఈఓగా వేరొకరు బాధ్యతలు స్వీకరించే వరకు శంతను సీఈఓగా కొనసాగుతారని స్పష్టం చేసింది. అడోబ్ కంపెనీ సీఈఓను ఎందుకు మారుస్తోంది?, లేదా.. శంతను నారాయణ్ ఎందుకు ఆ బాధ్యతల నుంచి తప్పు కుంటున్నారు అనేదానికి కారణాలు ఏమిటనేది అధికారికంగా వెల్లడి కాలేదు. శంతను సీఈఓగా తప్పుకున్నప్పటికీ.. సంస్థ బోర్డు ఛైర్మన్‌గా కొనసాగుతారని కంపెనీ పేర్కొంది. అడోబ్ బోర్డు కొత్త సీఈఓను ఎంపిక చేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సంస్థలో ఉన్న అభ్యర్థులతో పాటు




బయటి అభ్యర్థులను కూడా పరిశీలిస్తుంది. కాగా సంస్థ లీడ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ ఫ్రాంక్ కాల్డెరోని మాట్లాడుతూ.. శంతను నారాయణ్ గత 18 సంవత్సరాలుగా సంస్థ అభివృద్ధికి కృషి చేసారని తరువాయి 2లో..

## నో టెన్షన్ - భూగర్భ రహస్య గుహల్లో చమురు నిల్వలు



- భారత చమురు భద్రతకు రక్షాకవచాలుగా నిలుస్తున్న భూగర్భ నిల్వ కేంద్రాలు
- విశాఖపట్నంలో భూగర్భ రహస్య గుహల్లో మిలియన్ మెట్రిక్ టన్నుల నిల్వలు
- కర్ణాటక, తమిళనాడులోనూ నిల్వలు

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా యుద్ధం భారతదేశ చమురు పరాధీనతను కళ్లకు కట్టింది. విదేశాల నుంచి ముడిచమురు, ద్రవరూప పెట్రోలియం గ్యాస్, ద్రవరూప సహజవాయువు దిగుమతులు హఠాత్తుగా ఆగిపోతే భారత్ కష్టాలకడలిలో పడిపోవడం ఖాయమని వార్తలు వినవస్తున్నాయి. ఈ పరిస్థితిని చాన్నాళ్ల క్రితమే ఊహించిన భారత్ ముందుజాగ్రత్తగా భారీ స్థాయిలో పెట్రో ఉత్పత్తులను నిల్వచేసుకునే రహస్య భూగర్భ నిల్వ కేంద్రాలను నిర్మించుకుంది. వీటిల్లో మిలియన్ల మెట్రిక్ టన్నుల కొద్దీ ముడిచమురు ఉత్పత్తులను దాచిపెడుతోంది. భారత్ తన 90 శాతం ముడిచమురు, 60 శాతం ఎల్పీజీ, 50 శాతం సీఎన్జీ (CNG) అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడుతున్న తరువాయి 2లో..

# పెంపుడు శునకంతో యువకుడి శ్రీశైలం యాత్ర



**శ్రీశైలం:** పాదయాత్రగా శ్రీశైలం చేరుకుంటున్న కన్నడిగుల్లో ఒక్కొక్కరిది ఒక్కో మొక్కు. అలా వెళ్తున్న వారిలో ఈ ఓ యువకుడు ప్రత్యేకం. ఆ శునకానికి ఒక కాషాయ వస్త్రాన్ని చుట్టి ఒక పవిత్ర భావం కలిగేలా ప్రయాణిస్తున్నాడు. కర్ణాటకలోని రాయచూరు పట్టణానికి చెందిన వ్యోమకేశ్ అనే యువకుడి తల్లి ఇటీవల తీవ్రమైన అనారోగ్యానికి గురైయ్యింది. అదే సమయంలో బెంగతో తమ ఇంటి పెంపుడు శునకం కూడా అస్వస్థత పాలైంది.

దీంతో ఆవేదన చెందిన వ్యోమకేశ్ తన తల్లి, పెంపుడు శునకం ఆరోగ్యం కుదుట పడితే శ్రీశైల మల్లికార్జునుని పాదయాత్రతో వెళ్లి దర్శించుకుంటానని మొక్కుకున్నాడు. అంతే కాక తన శునకాన్ని కూడా భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపుకునే అవకాశం ఇవ్వాలని భావించాడు. అందుకే ఇలా పాదయాత్రా ప్రారంభించాడు. గురువారం ఆత్మకూరు పట్టణం మీదుగా వెళ్తూ ఇలా శునకంతో కనిపించాడు.

# విచిత్రం... జాలరి నోట్లోకి దూకిన చేప!



**ఒంగోలు టౌన్:** ఊహించని రీతిలో వలలోని చేప జాలరీ నోట్లోకి దూరింది. ఊపిరాడక గిలగిలలాడుతున్న సదరు జాలరీని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అత్యవసరంగా ఆపరేషన్ చేసిన జీజీహెచ్ వైద్యులు జాలరీ ప్రాణాలను కాపాడారు. వివరాల్లోకి వెళితే.. ఒంగోలుకు చెందిన సుబ్రమణ్యం గురువారం చేపలవేటకు వెళ్లారు. చేపలు పట్టుకొని ఇంటికి వచ్చిన ఆయన నోట్లో వలను పట్టుకొని చేపలను బయటకు తీస్తున్నారు.

ఆ సమయంలో అనుకోకుండా ఒక చేప సుబ్రమణ్యం నోట్లోకి వెళ్లింది. గొంతుకు అడ్డంపడి గిలగిలా కొట్టుకోసాగింది. దీంతో ఊపిరాడక అల్లాడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని జీజీహెచ్‌కు తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన ఈఎన్‌టీ హెచ్‌ఓడీ డాక్టర్ ప్రభాకర్ గొంతులో చేప ఉన్నట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులకు పరిస్థితిని వివరించి చెప్పారు. ట్రాకియాక్టమి పద్ధతిలో అత్యవసరంగా ఆపరేషన్ చేసి చేపను బయటకు తీశారు.

సుమారు గంటకు పైగా ఆపరేషన్ చేసి సకాలంలో చేపను బయటకు తీయడంతో సుబ్రహ్మణ్యం ప్రాణాలతో బయట పడ్డారు. ఆపరేషన్ బృందంలో డాక్టర్ రాంబాబు, డాక్టర్ కవిత, డాక్టర్ అర్జున్, డాక్టర లాలస పాల్గొన్నారు. క్లిష్టతరమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసి రోగి ప్రాణాలు కాపాడిన వైద్యులను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు ప్రశంసించారు.


# తెలంగాణలో భారీ GST కుంభకోణం

## నిందితుడి అరెస్టు




**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ భారీ జీఎస్టీ కుంభకోణాన్ని బయటపెట్టింది. సుమారు రూ.84.15 కోట్ల విలువైన ఐటీసీ మోసం జరిగినట్లు గుర్తించింది. ప్రధాన నిందితుడు, ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ ప్రొప్రైటర్ సందీప్‌ను అధికారులు అరెస్టు చేశారు. నిందితుడు నకిలీ ఇన్వాయిస్‌ల ద్వారా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్లు గుర్తించారు. సందీప్‌కు సంబంధమున్న ఇతర సంస్థల్లోనూ అక్రమాలు జరిగినట్లు తేలింది. ఈక్రమంలో వాటి రిజిస్ట్రేషన్లను అధికారులు రద్దు చేశారు. సందీప్‌ను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

## సీఈసీ అభిశంసనకు విపక్షాల నోటీసులు




**దిల్లీ:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కసరత్తులో అధికార భాజపాకు ఎన్నికల సంఘం పక్ష పాతంగా వ్యవహరిస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు లోక్‌సభ, రాజ్యసభల్లో అభిశంసన తీర్మానం నోటీసులు అందజేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. నోటీసులపై 130 మంది లోక్‌సభ, 63 మంది రాజ్యసభ ఎంపీలు సంతకాలు చేసినట్లు సమాచారం. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై అభిశంసన నోటీసు ఇవ్వడం ఇదే తొలిసారి. అయితే, సీఈసీ పక్షపాతంగా వ్యవహరించడం..తదితర ఏడు అభియోగాలు మోపినట్లు తెలుస్తోంది.

# అలిగిన పిఠాపురం వర్మ.. అధికారులపై ఆగ్రహం

**కాకినాడ జిల్లా, విశాఖ సమాచారమ్, మార్చి 13 :**

పిఠాపురం మున్సిపల్ అధికారులపై టీడీపీ నేత వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ కార్మికుల శిక్షణ కార్యక్రమం మధ్యలో నుంచి వర్మ అలిగి వెళ్లిపోయారు. ఫ్లెక్సీలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోటో పెద్దదిగా.. సీఎం చంద్రబాబు ఫోటో చిన్నదిగా వేశారంటూ వర్మ రగిలిపోయారు. చంద్రబాబుకు గౌరవం లేనప్పుడు ఇక్కడ ఉండమంటూ వర్మ అసహనం వ్యక్తం చేశారు. వర్మ అసహనంతో జనసేన నేతలు మౌనంగా ఉండిపోయారు.

పిఠాపురంలో జనసేన, టీడీపీ మధ్య రాజకీయం రచ్చ రచ్చగా మారుతోంది. కాగా, గత ఏడాది.. వర్మ సంచలన ట్వీట్ కలకలం రేపిన సంగతి తెలిసిందే.. 'కష్టపడి సాధించే విజయానికి గౌరవం' అంటూ తన ఎక్స్ హ్యాండిల్‌లో విడుదల చేసిన వీడియో దుమారం రేపింది. పవన్ కల్యాణ్ గెలుపు కోసం తాను చేసిన ఎన్నికల ప్రచారాలన్నీ కలిపి వీడియోగా రూపొందించి, పోస్టు చేశారు. ఆ వీడియోలో ఎక్కడా పవన్ కల్యాణ్ ఫొటో కూడా లేకపోవడం సంచలనంగా మారింది.

ఇదిలా ఉండగా, తన సోషల్ మీడియా అకౌంట్‌ను మూడేళ్లుగా హైదరాబాద్‌కు చెందిన సోషల్ ప్లానెట్ సంస్థ నిర్వహిస్తోందని.. తన



ఎక్స్ అకౌంట్‌లో వచ్చిన వీడియోతో తనకు ఎలాంటి సంబంధమూ లేదని వర్మ తన అకౌంట్‌లో పోస్టు పెట్టారు. తన ప్రమేయం లేకుండా సోషల్ ప్లానెట్ సంస్థ తప్పుడు వీడియో పోస్టు చేసిన విషయం తెలుసుకుని, వెంటనే డిలీట్ చేయించానని, తన పర్మిషన్ లేకుండా తప్పుడు వార్తలు పోస్టు చేస్తే తగిన చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. అలాగే, పిఠాపురం నియోజకవర్గంలో యథేచ్ఛగా జనసేన నేతలు ఇసుక దందా చేస్తున్నారంటూ గతంలో వర్మ సాక్ష్యాలతో సహా బయటపెట్టిన సంగతి తెలిసిందే.

# ప్రియుడితో మెనాలీసా పెళ్లి : రంగంలోకి వీహెచ్‌పీ




**ప్రయాగ్‌రాజ్ :** కుంభమేళా సోషల్‌మీడియా సంచలనం మోనాలీసా భోంస్లేకు చేదు అనుభవం ఎదురైంది. ఆమె ప్రేమ వివాహం చట్టవిరుద్ధమని విశ్వహిందూ పరిషత్ ఫిర్యాదు చేసింది. ఆమెది బాల్య వివాహమని వీహెచ్‌పీ ఆరోపించింది. దీంతో ఈ పెళ్లి నెట్టింట చర్చకు దారితీసింది. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన 2025 మహా కుంభమేళా సందర్భంగా విశేష గుర్తింపు పొందిన మోనాలిసా భోంస్లే ఇటీవల (మార్చి 11, 2026న) తన ప్రియుడు మహమ్మద్ ఫర్మాన్ ఖాన్‌ను పెళ్లాడింది. కేరళలోని అరుణ్మనూర్‌లోని శ్రీ నారాయణ గురు ఆలయంలో హిందూ సంప్రదాయాల ప్రకారీ వీరు పెళ్లి చేసుకున్నారు. అయితే మోనాలీసా మైనర్‌శ్రీ అనీ, ఈ వివాహం చెల్లదంటూ విశ్వహిందూ పరిషత్ కేరళ విభాగం గురువారం నాడు డీజీపీతో పాటు పూవార్ పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసింది.

ఈ మతాంతర వివాహం చట్టవిరుద్ధమని, ఎందుకంటే వధువు మైనర్ అని (18 ఏళ్లలోపు) విహెచ్‌పీ తన ఫిర్యాదులో ఆరోపించింది. బాల్య వివాహాల నిరోధక చట్టం, పిల్లలపై లైంగిక నేరాల నిరోధక చట్టం-2012 కింద విచారణ జరపాలని,అలాగే వివాహాన్ని నిర్వహించిన వారిపైనా, అందులో పాల్గొన్న వారిపైనా చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తూ విహెచ్‌పీ కేరళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ విలయిల్ కేరళ డీజీపికి, పూవార్ ×ుఉకు ఫిర్యాదు చేశారు.

ఈ ఫిర్యాదు ప్రకారం.. తమ వాదనకు ఆధారంగా, జనవరి 21, 2025న జరిగిన మోనాలిసా 16వ పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన సోషల్ మీడియా వీడియో దృశ్యాలను వీహెచ్‌పీ ప్రస్తావించింది. కనుక 18 ఏళ్ల లోపే జరిగిన మోనాలిసా భోంస్లే వివాహం చెల్లదని, ఆ జంటపైనా, ఆలయ అధికారులపైనా, అలాగే వారికి అండగా నిలిచిన రాజకీయ పోషకులపైనా చర్యలు తీసుకోవాలని ఆ సంస్థ డిమాండ్ చేసింది.

**మెనాలీసా క్లారిటీ**

తమ వివాహం చట్టబద్ధమైందనీ, లవ్ జిహాద్ కాదనీ కొత్త జంట తమపై వస్తున్న ఆరోపణలను ఖండించారు. మోనాలిసాకు 18 ఏళ్లు నిండాయని స్పష్టం చేశారు. ఇద్దరమూ ఇష్టప్రకారమే పెళ్లి చేసుకున్నామని వివరించారు. అలాగే జనవరి 1, 2008న జన్మించిందంటూ, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జారీ చేయబడిన జనన ధృవీకరణ పత్రాన్ని కూడా వారు సమర్పించారు. అయితే మెనాలీసా కుటుంబం ఈ పెళ్లికి అంగీకరించకపోవడంతో రక్షణ కోరుతూ తంపనూర్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. 18 సంవత్సరాలు నిండాక, చట్టబద్ధంగా నచ్చిన భాగస్వామితో జీవించడానికి స్వేచ్ఛ ఉందని పోలీసు అధికారులు వివరించారు. దీంతో వివాహం ప్రక్రియను ముగించారు.

# రెండు దశల్లో పశ్చిమ బెంగాల్ ఎన్నికలు!

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో జరిగే అవకాశం ఉందని ఎన్నికల సంఘం సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. మరో దశ సమావేశాల తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. కోల్‌కతాలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌తో ఇటీవల జరిగిన సమావేశంలో అధికార టీఎంసీ మినహా, రాష్ట్రంలోని చాలా రాజకీయ పార్టీలు ఒకటి లేదా రెండు దశల ఎన్నికలు కోరాయని, భద్రతా దళాల అధికారులు కూడా ఇలాంటి సూచనలే చేశారని చెప్పారు.

పశ్చిమ బెంగాల్‌లో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం వల్ల ఎన్నికలకు సంబంధించిన హింసను అరికట్టడం సులభమవుతుంది. తుది నిర్ణయం తీసుకునే ముందు ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటారని ఆయన అన్నారు. '288 సీట్లున్న మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలను ఒకే దశలో నిర్వహించాం. పశ్చిమ బెంగాల్‌లోనూ ఒకే దశలో నిర్వహించడం అసాధ్యమైతే కాదు. అయితే.. ఇక్కడ భద్రతా అంశాల దృష్ట్యా అది అసంభవం




అనిపిస్తోంది' అని అన్నారు.

ఎన్నికల సమయంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు ఈసీకి ప్రధాన ఆందోళనగా మారాయని, అయితే గట్టి నిఘా ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు హామీ ఇచ్చారని అధికారి తెలిపారు.

# నో టెన్షన్.. భూగర్బ రహస్య గుహల్లో చమురు నిల్వలు

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో వీలైనంత ఎక్కువ సరకును నిల్వచేసుకోవడంపై దృష్టిసారించింది. ఈ కారణంగానే హోర్ముజ్ జలసంధి వంటి కీలక చమురు సరఫరా మార్గాలు మూతబడినా వెంటనే కంగారుపడకుండా తన చమురు నిల్వలను ఉపయోగించుకునేందుకు సిద్ధమైంది. పాకిస్తాన్ వంటి దేశాలు ఏకంగా లాక్‌డౌన్ ప్రకటించి చేతులెత్తేసి చేష్టలుడిగి చూస్తున్నాయి.

**మూడు చోట్ల మహా గుహలు!**

చమురు ఉత్పత్తుల దిగుమతులు ఆగిపోయాయనే దిగులుతో భారత్ నిద్రలేని రాత్రులు గడపాల్సిన అవసరం లేదు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, కర్ణాటకలోని మంగళూరు, తమిళనాడులోని పాడూర్‌లో కేంద్రప్రభుత్వం మూడు భూగర్భ రహస్య నిల్వకేంద్రాలను నిర్వహిస్తోంది. ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో పదేళ్ల క్రితమే 4 కోట్ల బ్యారెళ్ల ముడిచమురును నిల్వచేసే భారీ భూగర్భ కేంద్రాన్ని నిర్మించారు.

ఇందులోని ముడిచమురు పది రోజులపాటు యావత్ భారతదేశ అవసరాలను తీర్చగలదు. బాంబు, డ్రోన్ దాడులను తట్టుకునేలా అత్యంత లోతులో వీటిని నిర్మించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలు, చమురు ఒలికిపోవడం వంటి లీకేజీ సమస్యలూ ఇక్కడ దాదాపు ఉండవు. గతంలోలాగా ఒకటి రెండు దేశాలపై ఆధారపడకుండా ఏకంగా 40 దేశాల నుంచి ముడిచమురును భారత్ దిగుమతి చేసుకుంటోంది. దీంతో ఏదో ఒకటి రెండు దేశాలు యుద్ధసంక్షోభంలో చిక్కుకున్నాసరే మిగతా దేశాల నుంచి నిరాటంకంగా దిగుమతులు కొనసాగే ఏర్పాట్లు భారత్ చేసుకుంది.

అంతర్జాతీయ చమురు సంక్షోభం తలెత్తకూడదనే ఉద్దేశంతో తాత్కాలికంగా రష్యా చమురును కొనేందుకు భారత్‌కు అమెరికా అనుమతి ఇవ్వడంతో వేగంగా భారత్ పావులు కదిపింది. దక్షిణాసియాలో ఇప్పటికే నౌకల్లోకి ఎక్కించిన 30 మిలియన్ బ్యారెళ్ల చమురును భారత్ కొనుగోలుచేసింది. దీనికితోడు గత పది రోజుల్లోనే ఒక్క అంగోలా నుంచే 34 లక్షల బ్యారెళ్ల ముడిచమురును భారత్ కొనేసింది. రిపబ్లిక్ ఆఫ్ కాంగో నుంచి మరో 19 లక్షల బ్యారెళ్ల చమురు కొనుగోలుచేసింది. ఇలా వచ్చిన సరకును వీలైనంత వరకు భూగర్భం కేంద్రాల్లో దాచేస్తోంది. ఎల్పీజీ స్టోరేజీ సైతం ఊపందుకుంది.

**అరకిలోమీటర్ లోతులో..**

కర్ణాటకలోని మంగళూరులో ఏర్పాటుచేసిన స్టోరేజీ సామర్థ్యం ఏకంగా 80,000 టన్నులు. ఇది అరకిలోమీటర్ లోతులో ఉంది. ఇదిగాక విశాఖపట్నంలో మరో ఎల్పీజీ నిల్వకేంద్రం ఉంది. దీని సామర్థ్యం 60,000 టన్నులు. ఇవిగాక మరికొన్ని రహస్య భూగర్భ రాతి గుహలను నిర్మించి మరింత ఎక్కువ చమురును నిల్వచేయాలని కొన్ని నెలల క్రితం పార్లమెంట్‌లో కేంద్రప్రభుత్వం ప్రకటించింది. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను తమిళనాడులోని పాడూర్‌లోనూ దాచేస్తోంది. ఒడిశాలోని ఛందీఖోల్‌లో మరో దానిని నిర్మించనున్నారు.

భూగర్భ గుహలు అనేవి వ్యూహాత్మకంగా సురక్షితమైనవి. భూమి మీది నిల్వకేంద్రాల నుంచి ఎండాకాలంలో కొంతమేర పెట్రో ఉత్పత్తులు వేడికి ఆవిరవుతాయి. భూగర్భంలో ఆ నష్టభయం ఉండదు. యుద్ధకాలంలో తొలిసారిగా స్వీడన్‌లో ఈ ప్రణాళికను అమలుచేశారు. తర్వాత ఫిన్లాండ్, జపాన్, దక్షిణకొరియా తదితర దేశాలు ఇదే బాటలో పయనించాయి. 1990లో గల్ఫ్ యుద్ధం నుంచి నేర్చుకున్న గుణపాఠాలతో భారత్ ఈ అండర్‌గ్రౌండ్ స్టోరేజీలకు అంకురార్పణ చేసింది.

# సీఈఓ పదవికి శంతను వీడ్కోలు కొత్త బాస్ ఎవరు?

(మొదటి పేజీ తరువాయి)

ప్రశంసించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో అడోబ్ విజయానికి ఆయన వేసిన పునాది ఎంతో కీలకమని చెప్పారు. శంతను సీఈఓగా తప్పుకోవాలనుకుంటున్న నిర్ణయాన్ని బోర్డుకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. దాదాపు 18 సంవత్సరాలుగా సీఈఓగా బాధ్యతలు నిర్వర్తించాను. కొత్త సీఈఓ ఎంపిక పూర్తయ్యే వరకు తాను బోర్డుతో కలిసి పనిచేసి.. బాధ్యతల మార్పు జరిగేలా చూస్తానని తెలిపారు.

ఈ సందర్భంగా తన నాయకత్వ కాలాన్ని గుర్తు చేసుకుంటూ అడోబ్ సంస్థ సాధించిన అభివృద్ధిని వివరించారు. తాను బాధ్యతలు చేపట్టినప్పుడు కంపెనీలో సుమారు 3,000 మంది ఉద్యోగులు ఉండేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 30,000 మందికి పైగా పెరిగిందని చెప్పారు. అలాగే కంపెనీ ఆదాయం కూడా ఒక బిలియన్ డాలర్ల కంటే తక్కువ స్థాయి నుంచి 25 బిలియన్ డాలర్లకు పైగా పెరిగిందని తెలిపారు.

# ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ బాధ్యతల స్వీకరణ

(మొదటి పేజీ తరువాయి)

ఠాకూర్ ఏప్రియల్ నెలలో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో అనంతరం ఏపీ హైకోర్టుకు మొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ వ్యవహరించనున్నారు.జస్టిస్ లీసా గిల్ స్వస్థలం చండిగఢ్ కాగా పంజాబ్ యూనివర్సిటీ నుండి ఎల్ఎల్బీ, ఎల్ ఎల్ ఎం పూర్తి చేశారు. 1990లో న్యాయవాదిగా పంజాబ్ హర్యానా హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు.2014 మార్చి 31న పంజాబ్ హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియామకం అయ్యారు. ఈకార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడిషినల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్,అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అడ్వకేట్స్ అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ కేవీ రఘు కుమార్, బార్ కౌన్సిల్ ఛైర్మన్ ద్వారకానాథ్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీ నారాయణ, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# తీవ్ర గాయాలతో కోమాలో ఖమేనీ

(మొదటి పేజీ తరువాయి)

ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారని కాలు తీసేసారని, కోమాలో ఉన్నారని తెలుస్తోంది. దీనిపై అధికారిక ధృవీకరణఘేదీ లేనప్పటికీ ఇప్పటివరకు ప్రజల ముందుకు రాకపోవడం ఈ అనుమానాలను బలపరుస్తోంది. ది సన్ నివేదిక ప్రకారం, మొజ్తబా కూడా తీవ్రంగా గాయపడ్డారని బ్రిటీష్ పత్రిక 'ద సన్' (ఞ్దవ ×ుబఅ) నివేదించింది. అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో హత్యకు గురైన ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ 56 ఏళ్ల కుమారుడు మోజ్తాబా ఖమేనీ తీవ్రంగా గాయపడి ,ప్రస్తుతం టెహ్రాన్‌లో చికిత్స పొందుతున్నాడని నివేదించింది. తండ్రిమరణానికి దారి తీసిన దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఖమేనీకి ఒక కాలు (లేదా రెండు కాళ్లు) తొలగించారని, కాలేయం లేదా కడుపు భాగంలో తీవ్రమైన గాయాలయ్యాయని సమాచారం. ప్రస్తుతం ఆయన టెహ్రాన్‌లోని సినా యూనివర్సిటీ హాస్పిటల్‌లో కోమాలో ఉన్నట్లు ఆ వార్తలు పేర్కొంటున్నాయి. దీనికి తోడు ఇరాన్ సుప్రీంగా ఎన్నికైన తరువాత తొలిసారి మొజ్తబా ఖమేనీ పేరుతో ఒక ప్రకటన జారీ అయింది. ఈ కొత్త ఫోటోలను ఇరాన్ మీడియా విడుదల చేసినప్పటికీ, అవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సృష్టించినవి లేదా పాత ఫోటోలను ఎడిట్ చేసినవనీ చాలా సంస్థలు అనుమానిస్తున్నాయి.

అయితే ఏఐ ఫోటో అన్న ఆరోపణలను ఇరాన్ ప్రభుత్వ అధికారులు, అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ కుమారుడు యూసుఫ్ ఖండించారు. మొజ్తబా ఖమేనీ "సురక్షితంగా, ఆరోగ్యంగా" ఉన్నారని , భద్రతా కారణాల దృష్ట్యా రహస్య ప్రదేశంలో ఉన్నారని పేర్కొన్నారు.

మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ విషయంపై స్పందిస్తూ, ఖమేనా గాయపడి ఉండవచ్చు, కానీ ఏదో ఒక రూపంలో బ్రతికే ఉన్నారని భావిస్తున్నానంటూ వ్యాఖ్యానించడంతో అసలు మొజ్తబా ఖమేనీ సజీవంగా ఉన్నారా లేదా అనుమానాలు మరింతగా చెలరేగాయి. అయితే ఖమేనీ కోమాలో ఉన్నట్లు వస్తున్న వార్తలకు అధికారిక ధృవీకరణ ఏదీ లేదు. కాగా ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో మొజ్తబా ఖమేనీ తండ్రి అలీ ఖమేనీనికోల్పోయిన సంగతి తెలిసిందే. అలాగే తల్లి, భార్యను, కొడుకును, అక్కను, ఆమె భర్తను, వారి పిల్లలు కూడా ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు.

# అలా అయితే మహిళలకు ఉద్యోగాలు కష్టమే : సుప్రీం కోర్టు

(మొదటి పేజీ తరువాయి)

ఉందని ఆరోగ్యం, విద్య, గౌరవం వారికి ప్రభుత్వాలు కల్పించాల్సిన బాధ్యత అని తెలిపింది.ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వాలు వారికి ఉచితంగా నాప్‌కీన్స్, ప్రత్యేకమైన టాయిలెట్స్, మెంటల్ హెల్త్ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పేర్కొంది.

# వంటగ్యాస్ కొరతపై కేంద్రం కీలక ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

పెట్రోల్ కొరత కూడా లేదని.. 30 శాతం ఎల్పీజీ ఉత్పత్తి పెంచినట్లు కేంద్రం వెల్లడించింది. ఎల్‌పీజీ బదులు ప్రజలు పీఎన్‌జీ తీసుకోవాలని.. ఎప్పటిలాగానే ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని కేంద్రం సూచించింది.

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా పెట్రోల్, గ్యాస్ కొరత ఏర్పడుతుందని ఆందోళన చెందుతున్న ప్రజలు.. భారీగా పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ గోడౌన్‌ల వద్ద క్యూ కడుతున్నారు. మరోవైపు, వాణిజ్య సిలిండర్ల కొరతతో అనేక హోటల్స్‌లలో నుంచి మెనూ మార్చేశారు. కొన్ని డిష్‌లకు తాత్కాలికంగా మంగళం పాడేశారు. ఇక పలు టీ దుకాణాలు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడి ఉంది. పలు హోటళ్లు కట్టెలు, పొట్టుతో కూడిన పొయ్యిలపై దృష్టి పెట్టాయి. దీంతో కట్టెలు, పొట్టుకు సైతం డిమాండ్ పెరిగింది.

## జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారం బ్యూరో):-**అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రముఖ కవయిత్రి, అక్షర తపస్విని మొల్ల జయంతి వేడుకలను ఈరోజు అత్యంత ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొని,మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన రావు మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించిన మొల్ల,తన అద్భుత ప్రతిభతో 'మొల్ల రామాయణాన్ని'సామాన్యులకు సైతం అర్థమయ్యే అత్యంత సరళమైన తెలుగులో రచించి చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. ఎటువంటి రాజపోషణ ఆశించకుండా, కేవలం భక్తితో ఆమె చేసిన అక్షర కృషి నేటి తరానికి, ముఖ్యంగా మహిళా సాధికారతకు గొప్ప స్ఫూర్తి అని,తెలుగు జాతి గర్వించదగ్గ కవయిత్రిగా ఆమె విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్‌తో పాటు పలు ప్రధాన నగరాల్లో ప్రతిష్టించడం ఆమె గొప్పతనానికి నిదర్శనం అని,ఆమె పట్టుదల మరియు సాహిత్య సేవను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు శ్రీ ఎం.దేవ ప్రసాద్,ఎల్.మోహన రావులతో పాటు, డీఎస్పీ జీ.ఆర్.ఆర్. మోహన్, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి,బాల సూర్యారావు, సేనం రమేష్, దేవుళ్ళు, పిల్లా రమేష్, ఎస్సైలు ప్రసాద్, రమణయ్య మరియు జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొని మొల్ల కి పుష్పాంజలి ఘటించారు.

## ఏ ఎం ఏ ఎల్ కళాశాలలో మెగా జాబ్ మేళా



**అనకాపల్లి (విశాఖ సమాచారం):-**అనకాపల్లి మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఏ ఎం ఏ ఎల్ కళాశాలలో ఈరోజు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, అనకాపల్లి వారి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించబడింది. ఈ జాబ్ మేళాకు సుమారు 18 కంపెనీల ప్రతినిధులు హాజరై, 375 మందిని ఇంటర్వ్యూ చేయగా, 127 మంది ఉద్యోగాలకు సెలెక్ట్ అవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ పెంటకోట వెంకట రామారావు మరియు అనకాపల్లి జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎన్. గోవిందరావు కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కష్టే ఫలి అన్నట్లుగా ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేస్తే ఆ కంపెనీ అభివృద్ధి చెందడమే కాక ఆ అభివృద్ధిని ఉద్యోగికి కూడా పంచుతుందని అనగా ఉద్యోగంలో ఎదుగుదల కనిపిస్తుందని అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని తద్వారా ఫలితాన్ని ఆశించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టీ. నిరంజన్ కుమార్, సూపరింటెండెంట్ శ్రీమతి పి. అనురాధ, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఉద్యోగులు పి. శ్రీనివాసరావు డిస్ట్రిక్ట్ ప్లేస్మెంట్ ఆఫీసర్, టీ. చంద్ర గణేష్ హెచ్ ఆర్ ఎం ఐ ఎస్, ఏ. చక్రవర్తి స్కిల్ కోఆర్డినేటర్, మందపల్లి శివ నాన్ టెక్నికల్ ఆఫీసర్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మాడుగుల డిగ్రీ కళాశాలలో కవయత్రి మొల్ల జయంతి

**వి మాడుగుల,(విశాఖ సమాచారం):-** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విమాడుగుల తెలుగు శాఖ ఆధ్వర్యంలో తొలి తెలుగు రామాయణ కవయత్రి మొల్ల జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మొల్ల చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ జి జయలక్ష్మి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జి జయలక్ష్మి అధ్యక్షోపన్యాసం చేస్తూ రామాయణ కవయత్రిగా మొల్ల చేసిన సాహిత్య కృషిని కొనియాడారు. తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ పులవర్తి పైడిరాజు మాట్లాడుతూ తెలుగులో రామాయణాన్ని సరళ సుందరంగా హృద్యంగా తీర్చిదిద్దిన మొల్ల గొప్పతనాన్ని కవిత్వ వైదుష్యాన్ని విద్యార్థులకు విశదీకరించారు. సంస్కృతంలో వాల్మీకి రచించిన రామాయణాన్ని తెలుగులో



ఎందరో కవులు రచించినప్పటికీ మొల్ల రామాయణం ప్రత్యేకత కలిగిన కావ్యంగా చెప్పవచ్చును అన్నారు. మొల్ల కవిత్వంలో మహిళా దృక్పథాంశాలు ఎన్నో కనిపిస్తాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపన్యాసకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ

**రావికమతం (విశాఖ సమాచారం):-**ఈనెల 16 నుంచి నిర్వహించే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు రావికమతం మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 9 జిల్లా పరిషత్ హై స్కూల్స్, ఒక ఆదర్శ పాఠశాల, కేజీబీవీ పాఠశాల, ఈ 11 పాఠశాలలకు సంబంధించి 638 మంది విద్యార్థిని, విద్యార్థులు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు రాసేందుకు హాజరవుతారని ఆయన తెలిపారు. అలాగే ప్రైవేటు పాఠశాలల నుండి 91 మంది విద్యార్థులు హాజరుకానున్నరన్నారు. ఈ పరీక్షలకు అవసరమైన నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. జడ్పీ హైస్కూల్ రావికమతం నందు182 మంది,ఏపీ మోడల్ స్కూలు మరుపాక నందు 220 మంది, పి ఎస్ ఆర్ ఎమ్ జెడ్పీ హైస్కూల్ కొత్తకోట నందు 150 మంది,జడ్పీ హైస్కూల్ దొండపూడి నందు 182 విద్యార్థులు పరీక్షలో పాల్గొనన్నారు. ఈ నాలుగు పరీక్ష కేంద్రాలలోనూ విద్యార్థులకు అవసరమైన బల్లలు, త్రాగునీరు, ఫ్యాన్లు, లైట్లు, టాయిలెట్లు, మెడికల్ సదుపాయము, మొదలగునవన్నీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే ఈ పరీక్షలకు 144 సెక్షన్ విధించబడిందని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా నిర్ణీత సమయానికి అరగంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకొని ప్రశాంతంగా పరీక్షలు రాసుకోవాలని ఆయన సూచించారు.

## ఆదివాసి గిరిజనులపై ప్రభుత్వానికి చిన్న చూపు తగదు !



- **సిపిఎం పార్టీ డిమాండ్**

**రావికమతం (విశాఖ సమాచారం):-**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులను చిన్నచూపు చూస్తున్నాయని సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. గోవిందరావు తెలిపారు. గిరిజనులు పండించిన జీడి మామిడి పంటకు మద్దతు ధర కల్పించాలంటూ మండలంలో డోలవాని పాలెం గ్రామంలో గిరిజన మహిళలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా గోవిందరావు మాట్లాడుతూ గిరిజనుల జీవనాధారమైనటువంటి జీడి మామిడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే కేజీ ధర 200 రూపాయలు ఇవ్వాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా జీడి పంటను కొనుగోలు చేయాలని కోరారు. దళారుల నుంచి గిరిజనులు పండించిన పంటను, గిరిజనులను కాపాడాల్సిన ప్రభుత్వం కనీసం గిరిజనుల వైపు కన్నెత్తి చూడకపోవడం, వారి డిమాండ్లను పరిష్కరించకపోవడం దారుణమన్నారు. నాన్ షెడ్యూల్ గిరిజన ప్రాంతాల్లో 22 వేలు ఎకరాలులో 20 వేలమంది గిరిజనులు, ఇతర పేద రైతులు జీడి మామిడి పంటను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు అన్నారు. అటువంటి వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, దళారులు వద్ద మోసపోవడం జరుగుతుందన్నారు. జీడి మామిడి తోటల పెట్టుబడి నిమిత్తం ఎకరాకు 20,000 వేలు పెట్టుబడి పెట్టి గిట్టుబాటు ధర లేకపోవడంతో పూర్తిగా నష్టపోతున్నామన్నారు. పంట చేతికొచ్చే వరకు పురుగులు మందులకు, జంగిల్ క్లియరెన్స్ కు, తదితర పెట్టుబడి నిమిత్తం ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులు వద్ద వేలాది రూపాయలు అప్పులు తీసుకొచ్చి పెట్టుబడి పెట్టవలసి వస్తుంది అన్నారు. ఆర్ వై ఎఫ్ ఆర్ పట్టా భూములకి బ్యాంకు రుణాలు అందించాలని, ఆర్ ఓ ఎఫ్ ఆర్ భూముల్లో జీడిమామిడి తోటలకి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని,ఈ క్రాఫ్ట్ నమోదు చేయాలని,ముదురు జీడి మామిడి తోటల పునరుద్ధరణ పథకం జీడి తోటలకు వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు, గిరిజన సంఘం నాయకులు అప్పారావు, పలువురు గిరిజన మహిళలు పాల్గొన్నారు.

## మండలంలోని 6 సి సి రోడ్లు 25 లక్షలు మంజూరు



- **పనులను ప్రారంభించిన పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి**

**నక్కపల్లి,(విశాఖ సమాచారం):-**మండలం లోని ఉపమాక శివారు సారిపల్లిపాలెం గ్రామంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాలు మేరకు 6 రోడ్లుకు గాను 25లక్షలు మంజూరు చేయగా నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి శనివారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనతి కాలంలోనే ఉపమాక గ్రామ పంచాయతీ కి సిసి రోడ్ల నిమిత్తం కోటి పది లక్షల రూపాయలు, అలాగే త్రాగు నీటి కొరకు పది లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసింది, నియోజకవర్గం లో ఇంతటి భారీ ఎత్తున అభివృద్ధి పనులు గతంలో టిడిపి ప్రభుత్వం లోనే జరిగింది. గత వైసిపి ప్రభుత్వం లో కనీసం ఒక్క పని కూడా జరగకపోగా అభివృద్ధి కి ఆటంకం కలిగింది. ఎక్కడ ఒక్కపని కూడా గ్రామస్థాయిలో జరగలేదు. మరల కూటమి ప్రభుత్వం అధికారంలో రావడం హోం మంత్రి అనిత నియోజకవర్గానికి భారీగా నిధులు మంజూరు చేయడం తో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, నాయకులు హోం మంత్రి కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రగడ వీరబాబు గ్రామ టిడిపి అధ్యక్షులు కొప్పిశెట్టి శ్రీను, టిడిపి నాయకులు ఎలమంచిలి రమణబాబు, ఎలమంచిలి జోగారావు, ఎలమంచిలి శ్రీను, శీరం నూకరాజు, చొప్ప నరసింహమూర్తి, నాగబాబు తోలేటి శ్రీను, కొప్పిశెట్టి వాసు, వెంకటప్పారావు జనసేన నాయకులు ఎలమంచిలి చంద్రరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సి సి రోడ్డుకు శంకుస్థాపన చేసిన కొప్పిశెట్టి వెంకటేష్



**నక్కపల్లి (విశాఖ సమాచారం):-** మండలం లోని ఉద్దండపురం గ్రామంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు వెలగా సుధాకర్,తో పాటు కూటమి నాయకులు కలిసి చంద్రగిరి రమణ వీధిలో సి సి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని వెంకటేష్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉద్దండ పురం టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు కుర్ర బాబ్జి, జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు అమలకంటి హరికృష్ణ, జనసేన మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్యామ్ కిషోర్, హై స్కూల్ చైర్మన్ వెలగా శ్రీను, మాజీ ఉపసర్పంచ్ బొల్లం రమణ, సీనియర్ నాయకుడు కీర్తి గోవిందరావు, పొడగట్ల రాజు, జనసేన గ్రామ శాఖ సెక్రెటరీ ఆవాల గోవింద్, చంద్రగిరి రమణ, పేకేటి గోవిందరావు, పేకేటి రాము, పేకేటి చిన్న రాజారావు, కుర్ర సూరిబాబు, వెల్లం శెట్టి సోమరాజు, తదితర నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ అవగాహన సదస్సు



**కాకినాడ రూరల్ విశాఖ సమాచారమ్ :** కాకినాడ రూరల్ మండలం గైగోలుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హోప్ ఫర్ చేంజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు లక్ష్మీ నాగేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా ఎగ్జామ్ ప్యాడ్లు (అట్టలు) మరియు స్టేషనరీ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా పరీక్షలపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలనే ఉద్దేశంతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చేయూత సంస్థ అధ్యక్షులు డా రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన పాటిస్తూ క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థి జీవితంలో కీలక దశ అని ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని చెప్పారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటరావు మాట్లాడుతూ పరీక్షల సమయంలో భయం అవసరం లేదని, ప్రశాంతంగా ఉండి పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. మన లక్ష్యాన్ని సాధించడానికి పదో తరగతి మొదటి మెట్టు అని తెలిపారు. సంస్థ అధ్యక్షులు లక్ష్మీ నాగేంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ తాను చదువుకున్న పాఠశాలకు సేవ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడి ఉపాధ్యాయులు ఎంతో మంచి బోధన అందిస్తారని, తాను ఈ స్థాయికి రావడానికి వారే కారణమని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదివి సమాజానికి తమవంతు సేవ చేయాలని కోరారు. అలాగే స్కూల్ ఫస్ట్ వచ్చిన ముగ్గురు విద్యార్థులకు తమ సంస్థ తరఫున సైకిళ్లు బహుమతిగా అందజేస్తామని ప్రకటించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, అట్టలు మరియు ఇతర స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు రేవతి, స్వాతి, దీపికా, ప్రమీల, కిరణ్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు జీవో 2,13,51 రద్దు చేయాలి

**అరకు లోయ విశాఖ సమాచారం :** అరకువేలి గిరిజన సంఘం భవనంలో మీడియా సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలాదేవ్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి, అరకువేలి,చింతపల్లి,జి కె వీధి, కొయ్యూరు మండలాల పరిధిలో గుజ్జెలి,చిట్టంవలస, పెదకోట,ఎర్రవరం,సీలేరు ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో 6100 మెగావాట్ల కరెంటు ఉత్పత్తి సామర్థ్యంతో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం నవయుగ, అదాని ,శిరిడి సాయి ఎలక్ట్రికల్ కన్స్ట్రక్షన్,మెగా బడా కార్పొరేట్ కంపెనీలకు ఆదివాసుల హక్కులు చట్టాలు ఉల్లంఘిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందని హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే 25 పంచాయితీలు 250 గ్రాములు సుమారు 60 వేల మంది ఆదివాసులు వేల ఎకరాల జిరాయితి అటవీ భూములు కాఫీ తోటలు వన్యప్రాణులు జల సమాధి అవుతాయని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్లు 2,13,51 తక్షణమే రద్దు చేస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేసి ఉత్తర్వులు జారీ చేయాలని మెగా డీఎస్సీలో ఆదివాసీ ప్రాంతాల్లో 100% ఉపాధ్యాయ పోస్టులకు గిరిజనులకు రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చారని నేటికీ స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయకపోవడం వల్ల మెగా డీఎస్సీలో సుమారు 4500 ఉపాధ్యాయ పోస్టులు ఆదివాసులు కోల్పోయారని ఒక్క అల్లూరి జిల్లాలోనే 92 శాతం




పాధ్యాయ పోస్టులు నాన్ లోకల్ తోనే భర్తీ చేశారని 2026 డీఎస్సీ నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్నా నేపథ్యంలో టెట్ పరీక్షలు కూడా జరిగాయని కానీ నూరు శాతం రిజర్వేషన్ ఉత్తర్వులు జారీ కాకపోవడం వల్ల ఆదివాసుల్లో తీవ్ర నిరసన నిస్పృహ పెరిగిందని 2026 డిఎస్సీలో ఆదివాసీ యువతకు న్యాయం చేయాలనీ ప్రభుత్వం 100% రిజర్వేషన్ అమలుకు తక్షణ ఉత్తర్వులు జారీ చేయాలని, అప్పటి వరకు 5 వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను జనరల్ డిఎస్సీలో విలీనం చేయవద్దని ఆదివాసీ ప్రత్యక డిఎస్సీ నోటిపికేషన్ విడుదల చేయాలని పాడేరు వంట్లమామిడి వచ్చే ముందే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ జారీ చేసిన జీవోలు 2,13,51 రద్దు చేయాలని ఆదివాసులకు ఉద్యోగ ఉపాధ్యాయ నూరు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఆదివాసీ ప్రత్యక డిఎస్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కొవ్వూరులో గ్రీవెన్స్ కార్యక్రమం



**కొవ్వూరు:** తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు గారు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో పాల్గొన్న ప్రజలు వారి సమస్యలు తెలుపుతూ 18 అర్జీలను అందజేశారు. వాటి వివరాలు పింఛన్లు కొరకు, కొత్త రేషన్ కార్డు,రెవిన్యూకు సంబంధించి వినతులు అందించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ కేడర్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ సమావేశంలో అనుపిండి చక్ర ధర రావు గారు, టుమెన్ కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ గారు, మద్దిపట్ల శివరామ కృష్ణ గారు, సూరపని చిన్ని గారు, చావా శ్రీను గారు ఎరుబండి వీర వెంకట రావు గారు పెనుమాక జయరాజు గారు, వరిగేటి కాంతరాజు గారు, కొక్కిరిపాటి వెంకటేష్ గారు . ముప్ప వరం శర్మ గారు,గారపాటి వెంకట కృష్ణ,గారు కొప్పాక జవహర్ గారు, జొన్నా బాలకృష్ణ, తదితర చీణూ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నక్కపల్లిలో బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్సీ గాదె




**నక్కపల్లి (విశాఖ సమాచారం):-**ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు శుక్రవారం నక్కపల్లి లో ఉన్న బాలికలు ఉన్నత పాఠశాలను సందర్శించి 10 వ తరగతి పరీక్షలు కు హాజరువుతున్న విద్యార్థులును ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పరీక్షలు బాగా రాసి శత శాతం పాస్ కావాలని, భవిష్యత్తు లో ఉన్నత స్థానాలుకు చేరుకోవాలని ఆశీస్సులు అందించేశారు. అలాగే పాఠశాల కు, ఉపాధ్యాయులు కు, తల్లిదండ్రులు కు మంచి పేరు తీసుకురావాలి అని కోరారు. అలాగే ఉద్యోగ,ఉపాధ్యాయులుకు మధ్యంతర భృతి ని ప్రకటించాలని,త్వరలో పి ఆర్ సి ని కూడా అమలు చేయాలని, సర్వీస్ రూల్స్ అమలుకు కృషి చేయాలని మరియు పెండింగ్ లో ఉన్న డి ఎ లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరడమైనది అని,ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు డి. గోపినాథ్, పి ఆర్ టి యు మండల శాఖ అధ్యక్షులు టి. వి. రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి,ఉపాధ్యాయులు ఎ. సత్యవతి,శేషగిరి,గుణవతి తదితరులు పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు ఆర్థిక భరోసా

- **అన్నదాతల ఇంట ఆనందాలు నింపుతున్న కూటమి ప్రభుత్వం**
- **రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంటు సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్**

**అనకాపల్లి (విశాఖ సమాచారం):-**రైతు సంక్షేమమే దేశ అభివృద్ధికి పునాది అన్న దృక్పథంతో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం రైతులకు గొప్ప ఆర్థిక భరోసాగా నిలుస్తోందని రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్,అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.యం రమేష్ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి సంవత్సరం రైతుల ఖాతాల్లోకి రూ. 6,000 నేరుగా జమ చేస్తూ రైతు కుటుంబాలకు ఆర్థిక మద్దతు



అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే మూడవ విడత కింద అనకాపల్లి జిల్లాలో కూడా ఈ పథకం ద్వారా పెద్ద ఎత్తున రైతులు లబ్ధి పొందుతున్నారని ఆయన అన్నారు. జిల్లాలో మొత్తం 2,42,536 మంది రైతులకు రూ. 134.27 కోట్ల రూపాయలు జమ చేసినట్లు వెల్లడించారు. ఇందులో అన్నదాత సుభిక్ష పథకం కింద రూ. 97.01 కోట్లు, పీఎం కిసాన్ పథకం కింద రూ. 37.26 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ అయ్యాయని తెలిపారు. రైతుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని,రైతు సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతులకు ఆర్థికంగా బలం చేకూర్చుతోందని పేర్కొన్నారు. రైతులు సంతోషంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## శతజయంతి ఉత్సవాలలో భాగస్వామ్యం చేయండి



**విశాఖపట్నం, విశాఖ సమాచారం):** ఆంధ్ర యూనివర్సిటీలో అతిథి ఆధ్యాపకుల రిజిస్ట్రార్ ఆఫీస్ వద్ద జరుగుతున్న నిరసన దీక్షలు ఈ రోజుకు 27వ రోజుకి చేరుకున్నవి. ముఖ్యంగా అతిథి అధ్యాపకులను శత జయంతి ఉత్సవాలలో భాగస్వామ్యం చేయాలని ఈ సందర్భంగా యూనివర్సిటీ అధికారులను కోరారు. అదే రకంగా ఉత్తరాంధ్ర ప్రాంతాల్లోని పేదరికాన్ని అవమానపరిచే విధంగా అధికారుల వైఖరి ఉందని ఉద్యమాల సూర్యుడు రిటైర్డ్ ప్రొఫెసర్ సూరప్పుడు ఆరోపించారు. శత జయంతి ఉత్సవాల సందర్భంగా అనేకమైనటువంటి కమిటీలను ఏర్పాటు చేసుకొని పండగ వాతావరణంలో ఉన్న సందర్భంలో సమస్యలను పరిష్కరించే ఆలోచన లేకపోవటం అనేది విచారకరంగా ఉందని మరియు శత జయంతి ఉత్సవాల్లో అతిథి అధ్యాపకులను పండగ చేసుకునే విధంగా చూడాలని ఈ సందర్భంగా అతిథి అధ్యాపకుల అధ్యక్షుడు డాక్టర్ ఎం. సురేష్ మీనన్ కోరారు . పెంచిన అర కొర జీతాలు రోజుకు 25 రూపాయల చొప్పున మరియు నెలకి 75 రూపాయలు చొప్పున పెరిగిన సంగతి తెలిసిన విషయమే. ఈరోజు నిరసన దీక్షలో పాల్గొన్న వారు డాక్టర్ ముసుగు ప్రసాద్, డాక్టర్ అంబేద్కర్, దాస్ , మహేష్, అబ్రహం , ప్రసాద్, విక్రమ్, దేవదానం, శిరీష్, రజిని, కోమలి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్

శనివారం 14-3-2026

# ఈ వ్యసనం చిన్నారుల భవిష్యత్తుకు ముప్పు!

**డిజిటల్ యుగంలో సోషల్ మీడియా చిన్నారుల మానసిక ఆరోగ్యంపై ఎలా ప్రభావం చూపుతోంది? ప్రపంచ దేశాలు తీసుకుంటున్న నియంత్రణలు, స్క్రీన్ టైమ్ ప్రభావాలు, తల్లిదండ్రుల బాధ్యతలపై విశ్లేషణ.**

**ఈ వ్యసనం చిన్నారుల భవిష్యత్తుకు ముప్పు!**

నేటి డిజిటల్ యుగంలో సమాచారం అరచేతిలోకి రావ డం సౌభాగ్యం అయినప్పటికీ, చిన్నారులపై ఇది శాపంగా మారుతోంది. విజ్ఞానాన్ని పంచే సాంకేతికత, తెలియని వయ సులో పిల్లలను సోషల్ మీడియా ఉబ్బిళ్లలోకి నెట్టేస్తోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి వేదికలు కేవలం వినోద సాధనాలు మాత్రమే కాక, పిల్లల ఆలోచన, వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తున్నాయి.. ఇది సామాజిక మార్పు మాత్రమే కాక, తరం మానసిక ఆరోగ్యంపై జరుగుతున్న దాడి. దీనిని ఆపడానికి అంతర్జాతీయంగా కొన్ని దేశాలు చర్యలు తీసుకున్నాయి. ఆస్ట్రేలియాలో 16 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా నిషేధం ఉంది. చైనాలో స్క్రీన్ సమయంపై కఠిన పరిమితులు ఉన్నాయి. యూకే, స్పెయిన్, నార్వే వంటి దేశాల్లో తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి చేయబడింది. భారతదేశంలోనూ ఈ చర్చ పెరుగుతోంది. కర్ణాటక ప్రభు త్వం 16 ఏళ్లలోపు, ఆంధ్రప్రదేశ్ 13 ఏళ్లలోపు పిల్లలపై నియంత్రణలపై దృష్టి సారిస్తోంది. గణాంకాల ప్రకారం, ప్రతి ముగ్గురిలో ఒకరు సోషల్ మీడియాకు బానిసలవుతున్నారు.. రోజుకు మూడు గంటల పైగా స్క్రీన్ గడపే పిల్లల్లో కోపం, ఒంటరితనం, నిద్రలేమి లక్షణాలు పెరుగుతున్నాయి. శారీరక సమస్యలు, సామాజిక నైపుణ్య లోపం వారిని సమాజానికి దూరం చేస్తాయి. లైకులు, ఫాలోవర్ల కోసం అనవసర పోలికలు, సైబర్ వేధింపులు, అసభ్యకర కంటెంట్ వారిని నేరాల వైపు నడిపిస్తున్నాయి. సోషల్ మీడియా సంస్థలు వ్యాపార ప్రయోజనాల కోసం రూపొందించిన అల్గారిథమ్స్ పిల్లలను వ్యసనపరులుగా మారుస్తున్నాయి. ఇదొక రకమైన 'డిజిటల్ డ్రగ్' అని విమర్శలు ఉన్నాయి. సమస్యను ప్రభుత్వ నియంత్రణకే వదిలించకూడదు. తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి చిన్న వయసులో స్మార్ట్ ఫోన్ అలవాట్లను నియంత్రించి, నాణ్యమైన సమయం, డిజిటల్ క్రమశిక్షణను ప్రోత్సహించాలి. సాంకేతికత మానవ వికాసానికి ఉపయోగపడాలి, వినాశకానికి కాదు. సురక్షితమైన బాల్యం మాత్రమే సుస్థిర భవిష్యత్తుకు మార్గం. సోషల్ మీడియా మాయలో మునిగే తరం రక్షించడం మనందరి తక్షణ కర్తవ్యం.

# సాటి లేని తెలుగు మహా కావ్యాలు

తెలుగులో మహా కావ్యాలు పురాణేతిహాసాలంత కావ్యాలుగా ప్రసిద్ధి చెందాయి. రామాయణ,మహాభారత, భాగవతాల తర్వాత, అల్లసాని పెద్దన మనుచరిత్ర, శ్రీకృష్ణదేవరాయలు వ్రాసిన ఆముక్తమాల్యద, భట్టుమూర్తి (రామరాజభూషణుని) వసుచరిత్ర,తెనాలి రామలింగడు విరచిత పాండురంగ మహాత్మ్యం, శ్రీనాథుని శృంగార నైషధం ప్రబంధ కావ్యాలు. ఈ ఐదు పురాణ ఇతివృత్తాన్ని తీసుకుని విస్తృతంచేసి వ్రాసిన మహాకవుల స్వతంత్ర రచనలు. ఇవికాక అంతే వాసి కావ్యాలుగా పేరుపొందిన పింగళి సూరన రాఘవ పాండవీయం, పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర బసవపురాణం, ముక్కు తిమ్మన పారిజాతాపహరణం లాంటి మరెందరో మహా కవుల రచనలు కూడా ఉన్నాయి.

సంస్కృత మహా భారత ఇతిహాసాన్ని సుమారు లక్ష శ్లోకాలతో వేదవ్యాస మహర్షి పూర్తి చేయగా, తెలుగులో ఆదికవి నన్నయ భట్టు ఆది, సభా పర్వాలు అరణ్య పర్వంలో కొంత భాగాన్ని క్రీ.శ 11 వ శతాబ్దిలో ఆంధ్రీకరించారు. పర్వాలను ఆశ్వాసాలుగా విభజించి రచించాడు. అదే విధంగా తిక్కన సోమయాజి 13 వ శతాబ్దిలో విరాటపర్వం నుండి స్వర్గారోహణ పర్వం వరకు 15 పర్వాలు, ఎర్రాప్రగడ 14 వ శతాబ్దిలో నన్నయ అసంపూర్తి అరణ్యపర్వం పూర్తి చేశాడు. సంస్కృతంలో 100 ఉప పర్వాలలో 1,00,500 శ్లోకాలతో వుంటే,తెలుగులో 63 ఆశ్వాసాలలో,21,507 పద్య,గద్యాలలో చంపూకావ్యం గా ఆంధ్ర మహాభారతాన్ని తీర్చిదిద్దారు కవిత్రయం. సంస్కృత మహాభారతంలో 19వ పర్వం భవిష్య పర్వం కూడా ఉంది. అందులో రెండు ఉప పర్వాలు ఉన్నాయి. వాటిని హరివంశమనే వేరే కావ్యంగా ఎర్రాప్రగడ రచించాడు.

నన్నయభట్టు తెలుగులో మొదటగా కావ్యాన్ని వ్రాసిన ఆదికవి. 11వ శతాబ్ది వరకు తెలుగు లిపి, కావ్య రచనా స్థాయికి చేరుకోలేదని,శాసనాల వరకే లిపి ఉండి, మౌఖిక సాహిత్యం ఎక్కువగా ఉండేదని తెలుస్తోంది. శాతవాహనుల కాలం ముందే, మన భాష ఆది ద్రావిడ భాషగా ఉండేది. కానీ లిపి దేశమంతా వాడే బ్రాహ్మీ లిపి మాత్రమే వుండేది. శాతవాహనుల కాలంలో బ్రాహ్మీ లిపి మన ప్రాంతంలో, భట్టిప్రోలు బ్రాహ్మీలిపిగా రూపాంతరం చెందిందని, బౌద్ధ శాసనాలు, స్థూపాలు (క్రీ.పూ. 3-2 శతాబ్దాల కాలం నాటివి భట్టిప్రోలు,ఘంటసాల,మచిలీపట్నంలో) దొరికినవి కనుక, వాటి ఆధారంగా లిపి(వ్రాత) మారినట్లు రూఢీ అయింది. ఆ లిపి క్రీ.శ 7-8 శతాబ్దాలలో తెలుగు, కన్నడ లిపులుగా విడిపోయి,11- 13 వ శతాబ్దాలలో పూర్తి తెలుగు అక్షరాలుగా, గుండ్రంగా మారి తాళపత్రాలపై వ్రాయుటకు వీలుగా మారినవి. అందుకని, 11వ శతాబ్ది నుండి తెలుగులో కావ్య రచన నన్నయతో మొదలైనది, కనుక ఆయన ఆదికవిగా, సంస్కృతాంధ్ర భాషావేత్తగా, తెలుగు వ్యాకరణ కర్తగా కూడా పేరు తెచ్చుకుని, ఇంకా వాగనుశాసనుడుగా బిరుదును పొందాడు. ఆ రోజుల్లో దేశమంతా, రాజ ఆస్థానాలలో, కవులు తమ కావ్యాలలో సంస్కృతం మాత్రమే వాడుట వలన రాజభాషగా సంస్కృతం చలామణి అయింది.

స్వగ్రామం తణుకులో పుట్టిన నన్నయభట్టు, వేంగీ దేశ చాళుక్య రాజైన రాజరాజ నరేంద్రుని రాజధాని వేంగీపురంలో (ప్రస్తుత రాజమహేంద్రవరంలో ) ఆంధ్రమహాభారత రచన సాగించాడు. ఇంకా ఆంధ్ర శబ్ద చింతామణి అనే తెలుగు వ్యాకరణ గ్రంథాన్ని,ఇంద్ర విజయం,చాముండికా విలాసం, లక్షణ సా ర ం , రా ఘ ్ ం వా బ ్ య ద ్ య ం కా వ్యా ల ం వ్రాశాడు.నన్నయ,రాజరాజనరేంద్రుని ఆస్థాన పండితుడు. ఆయన రాజరాజనరేంద్రుని ప్రేరణతో ఆంధ్ర మహాభారతాన్ని, సహాధ్యాయి అయిన నారాయణభట్టు సహాయంతో స్వేచ్ఛానువాదం చేసాడు. నన్నయభట్టు కవితాశైలి ఎలా వుంటుందంటే, కథాగమనం,సరళంగా ప్రసన్నంగా ఉండి, సన్నివేశాలు కథావేగానికి అడ్డుపడకుండా అర్థవంతంగా ఉంటాయి. పదాల కూర్పు,అక్షర రమ్యత సుకుమారంగా, శబ్దాలంకార సహితంగా వినసొంపుగా ఉంటుంది. నీతిని బోధించే సూక్తులతో పదాలు నానార్థాలతో పద్యాలు, రత్నాల ప్రవాహంలా కథతో పాటు దొర్లుకుంటూ చకచకా సాగిపోతుంటాయి. ఆయన రచనా శైలి, ద్రాక్షపాకానికి ప్రసిద్ధి. పాత్రల చిత్రీకరణ,సన్నివేశాలు కళ్లకు కట్టినట్లు చూపడం ఆయన ప్రత్యేకత. నన్నయ భట్టు రచనాశైలి, తరువాతి కవులకు ఆదర్శంగా, తెలుగు సాహిత్యానికి మార్గదర్శకమైనది. ఆయన,పద్య గద్యాత్మకమైన చంపూ కావ్యరీతి, కథాగమనానికి, వర్ణనలకు సరైన మార్గాన్ని, కావ్యానికి సంపూర్ణ రూపాన్నిచ్చింది. ఆయన వ్రాసిన మహా భారత కథలో, ఆది పర్వంలో పాండవ జననం, విద్యాభ్యాసం, కురువంశచరిత్ర, శకుంతలోపాఖ్యానం, పాండవులతో ద్రౌపదీ వివాహ ఘట్టాలు ఉన్నాయి. సభాపర్వంలో మయసభ,రాజసూయ యాగం, ద్యూతక్రీడ(పాచికలు ఆడుట), ద్రౌపదీ వస్త్రాపహరణం, పాండవుల అరణ్యవాసం లాంటి ముఖ్యమైన ఘట్టాలు, అరణ్య పర్వ శేషభాగంలో పాండవుల అరణ్యవాసం, శ్రీకృష్ణుడు అర్జునుని కలవడం, ఇతర సంబంధిత కథలను వ్రాస్తూ నన్నయ స్వర్గస్తుడయ్యాడు. తర్వాత మహాకవి తిక్కన సోమయాజి క్రీ.శ 13వ శతాబ్దికి చెందినవాడు. ఆంధ్ర మహాభారతాన్ని ఎక్కువ భాగాన్ని(15 పర్వాలు) వ్రాసిన కవిత్రయంలో రెండవ కవి. నెల్లూరు మనుమసిద్ధి మహారాజు ఆస్థాన కవి. ఈయన రచనా శైలి, నన్నయ బాటలోనే పయనిస్తూ, చదివేవారికి, సన్నివేశాలు నాటకీయంగా కళ్లముందు సాక్షాత్కరిస్తాయి, ఉత్కంఠను కలిగిస్తాయి. ఆ కాలంలో శైవ, వైష్ణవ మతాల మధ్య వున్న వైరుధ్యాలను,విభేదాలను రూపుమాపడానికి,హరి,హర అద్వైత (శివ, కేశవులు ఒక్కరే,భేదం లేదనే) సిద్ధాంతాన్ని తిక్కన ప్రచారం చేసాడు. మనుమసిద్ధి మహారాజు మంత్రిగా ఉండి, తర్వాత ఆయన కోల్పోయిన రాజ్యాన్ని,తన రాజకీయ చతురతతో, ఓరుగల్లు వెళ్లి కాకతీయ గణపతిదేవ చక్రవర్తిని మెప్పించి,ఆయన సాయంతో తిరిగి మనుమసిద్ధికి రాజ్యాన్ని ఇప్పించి, మహారాజుని చేశాడు. యజ్ఞం చేసి సోమయాజి అయ్యాడు. తిక్కన మహభారత కావ్య రచనే కాక నిర్వచనోత్తర రామాయణ పద్య కావ్యం వ్రాసి మనమసిద్ధికి అంకితమిచ్చాడు. మహాభారతాన్ని మాత్రం భద్రాద్రి శ్రీరామునికి అంకితం ఇచ్చాడు. ఆయనకు కవి బ్రహ్మ, ఉభయ కవిమిత్రుడు అనే బిరుదులు ఉన్నాయి.

తిక్కన సోమయాజి వ్రాసిన 15 పర్వాల కథలోని ముఖ్య ఘట్టాలలో, విరాట పర్వమందు పాండవుల అజ్ఞాతవాసం,కీచకవధ, ఉత్తరగోగ్రహణం ఉన్నాయి. తర్వాత ఉద్యోగ పర్వం లో శ్రీకృష్ణరాయబారం, కౌరవ పాండవ యుద్ధ సన్నాహాలు, శ్రీకృష్ణ కర్ణుని సంభాషణలు ఉంటాయి. భీష్మ పర్వంలో, కరుక్షేత్ర యుద్ధం, కౌరవుల పక్షాన భీష్మునికి సేనాధిపత్యం. శ్రీ కృష్ణుడు అర్జునునికి భగవద్గీత బోధించుట,భీష్ముని అంపశయ్య. ద్రోణపర్వంలో ద్రోణునికి సైన్యాధిపత్యం, అభిమన్యుని వధ, ద్రోణుని మరణం. కర్ణపర్వంలో,కర్ణ సైన్యాధిపత్యం, కృష్ణార్జునుల విజయం,కర్ణమరణం. శల్యపర్వంలో, శల్యునికి నాయకత్వం,దుర్యోధన మరణం, బలరాముని తీర్థయాత్ర. సౌప్తికపర్వంలో అశ్వత్థామ పాండవ కుమారులను నిద్రలో చంపడం. స్త్రీ పర్వంలో స్త్రీలు యుద్ధంలో చనిపోయిన వారికై విలాపం, పోయిన వారికి పిండ ప్రదానం. ధృతరాష్ట్ర దుఃఖం. శాంతి పర్వంలో, భీష్ముడు ధర్మరాజుకు రాజనీతి,మోక్షమార్గాల బోధ. అనుశాసనిక పర్వంలో భీష్మ ఉపదేశాలు విష్ణు సహస్రనామ స్తోత్రం. అశ్వమేధిక పర్వంలో ధర్మరాజు అశ్వమేధ యాగం,అర్జునుని దిగ్విజయ యాత్ర. ఆశ్రమవాస పర్వంలో ధృతరాష్ట్ర, గాంధారి,కుంతి వానప్రస్థం,తదుపరి మరణం. మౌసల పర్వంలో యాదవుల ముసలం వలన వినాశం. శ్రీకృష్ణుని దేహ త్యాగం. మహాప్రస్థానిక పర్వంలో పాండవుల మహాప్రస్థాన హిమాలయ యాత్ర, ద్రౌపది, పంచ పాండవుల పతనం. స్వర్గారోహణ పర్వంలో ధర్మరాజు స్వర్గ ప్రవేశం ద్రౌపది,మిగతా పాండవుల స్వర్గారోహణం.

సంస్కృత భారతంలోని,విష్ణు సహస్రనామ స్తోత్రం, భగవద్గీతను వాటి పవిత్రత చెడకుండా వాటిని తిక్కన యధాతథంగా ఉంచాడు. ముందు చెప్పినట్లుగా, ఎర్రా ప్రగడ అరణ్యపర్వ శేష భాగాన్ని పూర్తి చేసి, సంస్కృత మహా భారత 19వ పర్వం(తిక్కన వదిలిన) భవిష్య పర్వాన్ని, హరివంశం అనే వేరే కావ్యంగా వ్రాశాడు. ఈయన 14వ శతాబ్దపు కవి, ప్రస్తుత నెల్లూరు జిల్లా (అప్పుడు పాకనాడు) గుడ్లూరు గ్రామవాసి. రెడ్డి వంశ స్థాపకుడైన ప్రోలయ వేమారెడ్డి ఆస్థానంలో కవి. నన్నయ వదిలిన అరణ్య పర్వ శేష భాగాన్ని, ఆయన రచనా శైలిలో మొదలు పెట్టి తిక్కన శైలిలో పూర్తి చేశాడు. హరి వంశాన్ని ప్రోలయ వేమారెడ్డికి అంకితమిచ్చాడు. ఇవిగాక నృసింహ పురాణ కావ్యాన్ని కూడా రచించాడు. ప్రబంధ శైలి కావ్యాన్ని మొదటగా తెలుగులో వ్రాశాడు కనుక ప్రబంధ పరమేశ్వరుడనీ, శివభక్తుడైనందున శంభుదాసుడనీ ఎర్రాప్రగడకు బిరుదులు కలవు.

ఆంధ్ర మహాభారత మహా కావ్యాన్ని వ్రాసిన నన్నయ, తిక్కన, ఎర్రాప్రగడ తెలుగు భాషా మాధుర్యాన్ని ప్రపంచానికి చాటి భాషను అజరామరం చేసారు.

**బూర్గుల రామకృష్ణ సాయి**

# 'పాట్ ఇన్ పాట్' పద్ధతి - గ్యాస్ ఆదా

గ్యాస్ సంక్షోభం పెరుగుతున్న నేపథ్యంలో 'పాట్ ఇన్ పాట్' పద్ధతి నిజంగా చాలా తెలివైన మరియు పొదుపైన మార్గం.

'పాట్ ఇన్ పాట్' వల్ల కలిగే ప్రయోజనాలు:

సమయం ఆదా: అన్నం కోసం ఒకసారి, కూర లేదా పప్పు కోసం మరోసారి కుక్కర్ పెట్టాల్సిన అవసరం ఉండదు. రెండు పనులు 15-20 నిమిషాల్లో పూర్తవుతాయి.

పోషకాలు పోవు: ఆవిరి మీద ఉడకటం (హ్ముఎఅఅస్త్ర) వల్ల కూరగాయలలోని విటమిన్లు, ఖనిజాలు బయటకు పోకుండా ఉంటాయి.

శ్రమ తగ్గుతుంది: ఎక్కువ గిన్నెలు కడగాల్సిన అవసరం ఉండదు మరియు వంటగది వేడెక్కడం కూడా తగ్గుతుంది.

ఈ పద్ధతిలో వండేటప్పుడు కొన్ని చిట్కాలు:

పాత్రల ఎంపిక: కుక్కర్లో పట్టేలా సమానమైన వెడల్పు ఉన్న స్టీల్ గిన్నెలను వాడాలి. కింద అన్నం గిన్నె, పైన పప్పు/కూర గిన్నె పెట్టడం వల్ల వేడి సమానంగా అందుతుంది.

నీటి మోతాదు: కింద గిన్నెలో (అన్నం) పోసే నీటి కంటే, కుక్కర్ అడుగున పోసే నీరు సరిపడా ఉండాలి. లేదంటే అడుగు మాడిపోయే అవకాశం ఉంది.

ఉడికే సమయం: పప్పు మరియు అన్నం ఉడకడానికి దాదాపు ఒకే సమయం పడుతుంది. ఒకవేళ మీరు త్వరగా ఉడికే కూరగాయలు (ఉదాహరణకు బెండకాయ లేదా పాలకూర) వండాలనుకుంటే, వాటిని చిన్న ముక్కలుగా కోయకుండా పెద్ద ముక్కలుగా ఉంచడం మంచిది.

మీరు ప్రయత్నించదగ్గ ఇతర చిట్కాలు:

కూరగాయలు ముందుగా నానబెట్టడం: పప్పును వండటానికి 30 నిమిషాల ముందే నానబెడితే, అది ఇంకా త్వరగా ఉడుకుతుంది. దీనివల్ల గ్యాస్ మరింత ఆదా అవుతుంది.

ఫ్లాస్క్ వినియోగం: వేడి నీటిని ఫ్లాస్క్‌లో ఉంచుకుని వంటకు వాడితే, గ్యాస్ మంటపై నీరు వేడెక్కే సమయం తగ్గుతుంది.

వంట గ్యాస్‌ను ఆదా చేయడానికి మరియు వంటగదిలో పనిని సులభతరం చేయడానికి 'పాట్ ఇన్ పాట్' కాకుండా మరిన్ని ఉపయోగకరమైన పద్ధతులు:

1. పప్పులు మరియు ధాన్యాలను నానబెట్టడం

పప్పులు, బియ్యం లేదా శనగలు వంటి వాటిని వండటానికి కనీసం 30 నిమిషాల ముందు నానబెట్టండి.

ప్రయోజనం: ఇలా చేయడం వల్ల అవి త్వరగా ఉడుకుతాయి. దీనివల్ల దాదాపు 20% గ్యాస్ ఆదా అవుతుంది.

2. సరైన పరిమాణంలో పాత్రలు వాడటం

మంట (Flame) పాత్ర అడుగు భాగం కంటే బయటకు రాకుండా చూసుకోవాలి.

చిట్కా: వెడల్పాటి అడుగు గల పాత్రలు వాడటం వల్ల వేడి సమానంగా వ్యాపించి ఆహారం త్వరగా ఉడుకుతుంది. పాత్రపై ఎప్పుడూ మూత ఉంచడం మర్చిపోకండి.

3. 'తక్కువ మంట' (Simmer) సూత్రం

నీరు లేదా ఆహారం మరగడం ప్రారంభించిన తర్వాత మంటను తగ్గించండి (ాఅఎ).

నీరు మరిగేటప్పుడు మంటను ఎంత పెంచినా ఉష్ణోగ్రత పెరగదు, కేవలం నీరు ఆవిరి అయిపోతుంది. తక్కువ మంటపై వండటం వల్ల గ్యాస్ ఆదా అవ్వడమే కాకుండా రుచి కూడా పెరుగుతుంది.

4. థర్మోస్ ఫ్లాస్క్ వినియోగం

వేడి నీటిని ఫ్లాస్క్‌లో పోసి ఉంచుకోండి.

చిట్కా: టీ, కాఫీ లేదా వంటలో వాడే వేడి నీటి కోసం పదే పదే స్టవ్ వెలిగించాల్సిన అవసరం ఉండదు.

5. ఫ్రిజ్ నుండి తీసిన వస్తువులను వెంటనే వండకండి

పాలు, కూరగాయలు లేదా పిండిని ఫ్రిజ్ నుండి తీసిన వెంటనే స్టవ్‌పై పెట్టకండి.

చిట్కా: అవి సాధారణ ఉష్ణోగ్రతకు (Room Temperature) వచ్చే వరకు వేచి ఉండి, ఆపై వండండి. దీనివల్ల వాటిని వేడి చేయడానికి పట్టే అదనపు గ్యాస్ ఆదా అవుతుంది.

6. బర్నర్ల శుభ్రత

స్టవ్ బర్నర్ల నుండి వచ్చే మంట నీలం రంగులో ఉండాలి.

గమనిక: మంట పసుపు రంగులో వస్తుంటే బర్నర్లు బ్లాక్ అయ్యాయని అర్థం. ఇది ఎక్కువ గ్యాస్‌ను వృధా చేస్తుంది. కాబట్టి క్రమం తప్పకుండా బర్నర్లను శుభ్రం చేయండి.

ఒక చిన్న లెక్క:

సాధారణంగా గ్యాస్ ఆదా చేసే పద్ధతులు పాటిస్తే, ఒక సిలిండర్ అదనంగా 10 నుండి 15 రోజులు ఎక్కువ వచ్చే అవకాశం ఉంది. ఇవి అందరికీ తెలిసినవే అయినప్పటికీ ఇటువంటి చిట్కాలు ఈ సమయంలో పాటిస్తే సామాన్యులకు ఎంతో మేలు మరియు గ్యాస్ ఆదా.

**డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు, మాజీ రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం,**

**మేనేజింగ్ ట్రస్టీ, లయన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, విశాఖపట్నం.**

# వంట గ్యాస్ సంక్షోభం..

## విదేశీ ఆధారితత్వం భారత్‌కు కొత్త హెచ్చరిక!

అమెరికాఉఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి మార్గంలో ఇంధన రవాణా దెబ్బతినడంతో భారత్‌లో వంట గ్యాస్ సరఫరా సమస్యలు తలెత్తుతున్నాయి. దిగుమతులపై ఆధారపడే పరిస్థితి, తక్కువ నిల్వ సామర్థ్యం మరియు భవిష్యత్ ఇంధన భద్రతపై ఈ వ్యాసం విశ్లేషిస్తుంది.

వంట గ్యాస్ సంక్షోభం.. విదేశీ ఆధారితత్వం భారత్‌కు కొత్త హెచ్చరిక!

దేశంలోని ప్రజలు వంట గ్యాస్ సిలిండర్ బుక్ చేయడానికి పదేపదే ప్రయత్నిస్తున్నా ఏజెన్సీ నుండి స్పందన లేదు.. చాలా మందికి ఇదే సమస్య మొదలైంది. ధర పెరగడం పక్కన పెడితే సరఫరా కూడా పట్టాలు తప్పింది. కారణం సుస్పష్టం. అమెరికా ఇరాన్ యుద్ధం మధ్యలో ప్రపంచ ఇంధన భద్రత చితికిపోతోంది. మన దేశం అందుకు అతీతం కాదు.. కానీ ఇంత త్వరగా దుష్ప్రభావాలు సోకడం ఆలోచించదగ్గది. ఎలాంటి విధానాల ద్వారా బాహ్య ప్రభావాల్ని తక్కువ నష్టానికి నియంత్రించగలమో, పరాధీనత నుండి బయటపడగలమో ఆలోచించి, అమలు చేయకపోతే మున్ముందు కష్టం. దేశంలో వినియోగించే వంట గ్యాస్ కోసం దాదాపు 60 శాతం వరకూ దిగుమతులపైనే ఆధార పడుతున్నాం. అందులో 85 శాతం పశ్చిమాసియా నుండి హోర్ముజ్ జలసంధి మార్గంలో వస్తోంది. ఇప్పుడు ఆ మార్గంలో రాకపోకలు మూసుకుపోవడమే కాకుండా, ప్రమాదభరితంగా తయారైంది. ఇప్పటి వరకు మన దేశం గ్యాస్ దిగుమతి చేసుకొని వచ్చింది వచ్చినట్టు ఉపయోగించుకునేలా తయారైంది. తప్ప నిల్వలు ఉంచుకొనే చర్యలు చేపట్టలేదు.. అవసరం కొండంత.. నిల్వ సామర్థ్యం గోరంత. ఇక దేశీయ ఉత్పత్తిని 25 శాతం పెంచేలా ప్రధాని ఆదేశించినా, అది పూర్తిగా అమలైనా దేశీయ అవసరాలకు చాలదు.. ఎందుకంటే ఒక దశాబ్దంలోనే వంట గ్యాస్ వినియోగం 120 రెట్లు పెరిగింది. అమెరికా నుండి దిగుమతికి ఒప్పందాలు కుదిరినా, అది చేరేటప్పటికి నెలపైనే పడుతుంది. వంట గ్యాస్ కొరత గృహస్తులపైనే కాకుండా చిన్న చిన్న వ్యాపారాలు, హోటల్స్, ఫుడ్ డెలివరీ రంగంపై కూడా ప్రభావం చూపనుంది. ప్రభుత్వం నష్ట నివారణ,




వినియోగదారునికి కష్టం తగ్గించే ఆలోచన చెయ్యాలి. అలాగే స్వల్పకాలిక సర్దుబాట్లతో పాటు దీర్ఘకాలిక వ్యూహాలను ఆలోచించాలి. ముఖ్యంగా నిల్వ సామర్థ్యం పెంపు, దేశీయ ఉత్పత్తి పెంపు, ప్రత్యామ్నాయ దిగుమతుల ఏర్పాట్లు చూసుకో వాలి. ఇదే అదనుగా సాగే ఖ కొరత, బ్లాక్ మార్కెట్‌లను కట్టడి చెయ్యాలి.

# 2026లో ధనవతుల జాబితా:



భారతదేశ బిలియనీర్ల జనాభా వేగంగా విస్తరిస్తోంది. హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ 2026 ప్రకారం, ఇండియాలో ఇప్పుడు 308 మంది బిలియనీర్లు ఉన్నారు, వారి మొత్తం సంపద రూ. 112 లక్షల కోట్లు అని అంచనా. దీంతో భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద బిలియనీర్ల కేంద్రంగా నిలిచింది, యునైటెడ్ స్టేట్స్, చైనా ముందు వరుసలో ఉన్నాయి. 2026లో భారతదేశంలో అత్యంత ధనవంతుడిగా ముఖేష్ అంబానీ మరోసారి అగ్రస్థానంలో నిలిచారు. రెండవ స్థానంలో గౌతమ్ అదానీ, మూడో స్థానంలో రోష్ని నాదర్ మల్హోత్రా నిలిచారు.

భారతదేశంలోని టాప్ 10 ధనవంతులు

➤ముఖేష్ అంబానీ: రూ. 9.8 లక్షల కోట్లు
➤గౌతమ్ అదానీ: రూ. 7.5 లక్షల కోట్లు
➤రోష్నీ నాడార్: రూ. 3.2 లక్షల కోట్లు
➤సైరస్ ఎస్ పూనావల్ల: రూ. 3.0 లక్షల కోట్లు
➤కుమార్ బిర్లా: రూ. 2.5 లక్షల కోట్లు
➤దిలీప్ షాంఘ్వీ: రూ. 2.3 లక్షల కోట్లు
➤అజీమ్ ప్రేమ్‌జీ: రూ. 2.3 లక్షల కోట్లు
➤నీరజ్ బజాజ్: రూ. 2.2 లక్షల కోట్లు
➤అశోక్ హిందూజా: రూ. 2.2 లక్షల కోట్లు
➤రాధాకృష్ణ దమానీ: రూ. 1.5 లక్షల కోట్లు


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

టెండరు ప్రకటన నెం. VSKP-ELECTG-25-26-WC-44, తేదీ. 09.03.2026

పని పేరు: కిరండుల్ స్టేషన్ వద్ద ఫ్రైయిట్ ఎలక్ట్రిక్ లోకోలు మెయింటెనెన్స్ మరియు షెడ్యూలు కొరకు ట్రిప్ (TRIP) షెడ్ నిర్మించుట.

టెండరు విలువ: ₹ 53,71,008.32, బయానా: ₹ 1,07,400/-, పని పూర్తి చేయు కాలం: 240 రోజులు.

టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 31.03.2026న 1330 గంటలకు.

టెండరు తెరచు తేదీ మరియు సమయం: 31.03.2026న 1600 గంటలకు.

టెండరు డాక్యుమెంట్లు మరియు పూర్తి వివరములు లభించు వైబ్‌సైట్: www.ireps.gov.in

ఏదైనా జారీ చేసిన సవరణ కొరకు వెబ్‌సైట్‌ను గమనించ వలసినదిగా టెండరుదారులకు కోరుచున్నాము.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు (జనరల్), వాల్తేరు

PR-1217/Q/25-26


# ఆ ఏడాదిలో అసలు వేసవే లేదు!





మార్చి నెల వచ్చేసింది. ఎండ తాపం మొదలైంది. జనాలు అప్పుడే ఎండ వేడిమి తాళలేక ఉసూరుమంటున్నారు. బయటి వెళ్లినవారు మజ్జిగ, చెరుకురసం, పళ్లరసాలను తాగుతూ కాస్త ఉపశమనం పొందుతున్నారు. ఏటా వేసవి కాలంలో ఇవన్నీ సహజంగా జరిగేవే. అయితే ఒకానొక సంవత్సరం అసలు వేసవే లేకుండా గడిచిపోయింది. ఆ విషయం మీకు తెలుసా?

అవును..1816 సంవత్సరం వేసవి లేకుండా గడిచిపోయింది. అందుకే దాన్ని 'ష్త్రవ౯్ముతీ షఫ్త్రశీబ్ ాబఎవవతీ' అని పిలుస్తారు. ఆ ఏడాది ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు 0.4ఉ0.7 సెంటిగ్రేడ్‌లు తగ్గాయి. ఆ సంవత్సరం యూరప్‌లో వేసవి ఉష్ణోగ్రతలు సైతం అత్యంత చల్లగా ఉన్నాయి.

1815 ఏప్రిల్‌లో ఇండోనేషియాలో మౌంట్ టాంబోరా విస్ఫోటనం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని వాతావరణ శాస్త్రవేత్తలు అంటున్నారు. 1,300 సంవత్సరాలలో ఇది అతి పెద్ద విస్ఫోటనం అంటున్నారు. వాతావరణంపై దాని ప్రభావం పడటం వల్ల వేసవి లేకుండా గడిచిపోయిందంటున్నారు. ఎండలు లేకపోతే హాయిగా ఉంటుంది కదా అని మీరు అనుకోవచ్చు. కానీ మనకు ఎండలు చాలా అవసరం.

ఎండలు లేకపోతే వర్షాలు సక్రమంగా కురవవు. పంటలు సరిగ్గా పండవు. దీంతో 1816లో ప్రపంచం తీవ్ర ఆహార కొరతను ఎదుర్కోవాల్సి వచ్చింది. యునైటెడ్ కింగ్‌డమ్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్, ఐర్లాండ్, బోర్బన్ రిస్టోరేషన్ ఫ్రాన్స్ వంటి దేశాలు కరువు బారిన పడ్డాయి. 1816 తర్వాత మళ్లీ ఇప్పటిదాకా వేసవి లేని ఏడాది రాలేదు.

# దినచర్య సూచి గూగుల్ సీసీ




గూగుల్ మరో కొత్త ప్రయోగాత్మక ఏఐ ఏజెంట్‌ను ఆవిష్కరించింది. దీని పేరు సీసీ. ఇది రోజూ ఉదయాన్నే ఈమెయిళ్లు, క్యాలెండర్ వివరాలు, ఇతర డాక్యుమెంట్లు అన్నింటినీ కలగలపి ఏఐ జనరేటెడ్ సారాంశాన్ని అందిస్తుంది. యువర్ డే హెడ్ అనే శీర్షికతో యూజర్ ఇన్‌బాక్స్‌లో బ్రీఫింగ్ ఇస్తుంది. ఆ రోజున చేయాల్సిన పనులు, కట్టాల్సిన బిల్లులు, అపాయింట్‌మెంట్ల వంటివన్నీ ఇందులో ఉంటాయి. ఈమెయిల్ డ్రాఫ్ట్‌ను జనరేట్ చేయటానికి, దానంతటదే గూగుల్ క్యాలెండర్‌కు ఈవెంట్స్‌ను యాడ్ చేయటానికీ దీన్ని వాడుకోవచ్చు. కస్టమ్ రిక్వెస్ట్‌తో నేరుగా మెయిల్ చేయటం లేదా జవాబు ఇవ్వటం ద్వారానూ సీసీకి ఆదేశాలు ఇవ్వచ్చు. మీ గురించి తెలుసుకునేలా దీనికి శిక్షణ ఇవ్వచ్చు కూడా. ఐడియాలు, చేయాల్సిన పనులను గుర్తుపెట్టుకోమనీ చెప్పొచ్చు. జెమినై సాయంతో ఏఐ మోడల్స్‌తో పనిచేసే ఇది జీమెయిల్, గూగుల్ క్యాలెండర్, గూగుల్ డ్రైవ్‌లను సింక్ చేయటంతో పాటు అంతర్జాలం నుంచి సమాచారాన్ని తీసుకోవటం ద్వారా యూజర్ల గురించి మరింత బాగా తెలుసుకోగలదు. మీ గురించి మరింత తెలుసుకునేలా తీర్చిదిద్దేలా చేసి, అవసరాలకు అనుగుణంగానూ సీసీని మలచుకోవచ్చు.

# జీ తెలుగు డ్రామా జూనియర్స్ సీజన్ 9 ఆడిషన్స్ మార్చి 14న, మన విశాఖపట్నంలో!




**విశాఖ సమాచారం:** ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ ముందుండే ఛానల్ జీ తెలుగు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసి బుల్లితెరపై మెరిసే అవకాశం కల్పిస్తూ విజయవంతంగా కొనసాగుతున్న సక్సెస్ఫుల్ షో డ్రామా జూనియర్స్ సరికొత్త సీజన్తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. తెలుగు రాష్ట్రాల్లోని పిల్లల్లోని నటనా ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో డ్రామా జూనియర్స్ సీజన్ 9 ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఇప్పటికే విజయవంతంగా 8 సీజన్‌లను పూర్తి చేసుకున్న డ్రామా జూనియర్స్ మరో సీజన్తో తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ప్రతిభగల పిల్లలని ఆడిషన్స్కి ఆహ్వానిస్తోంది. – డ్రామా జూనియర్స్ సీజన్ 9 కోసం తెలుగు రాష్ట్రాల్లో నటనపై ఆసక్తిగల చిన్నారులకు అద్భుత అవకాశం అందిస్తోంది. 4 నుంచి 12 సంవత్సరాల వయస్సు గల పిల్లలు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు చక్కని అవకాశం అందిస్తోంది జీ తెలుగు. మీ పిల్లలకు నటనపై ఆసక్తి ఉంటే తప్పకుండా ప్రోత్సహించి వారి భవిష్యత్తుకు బాటలు వేయండి. విజయవంతంగా కొనసాగుతున్న జీ తెలుగు డ్రామా జూనియర్స్ వేదికగా తమ నటనతో అలరించే పిల్లలకోసం ఆఫ్లైన్ ఆడిషన్స్ నిర్వహించనుంది. నటన, అద్భుతమైన డైలాగ్ డెలివరీ, మార్షల్ ఆర్ట్స్, మ్యాజిక్ లో ప్రవేశం ఉన్న పిల్లలకూ అద్భుత అవకాశం అందిస్తోంది. ఈ ఆడిషన్స్ శనివారం( మార్చి 14న) రోజు, శ్రీ ప్రకాష్ విద్యానికేతన్, టి.పి.టి కాలనీ(TPT కాలనీ), సీతమ్మధార, విశాఖపట్నం నందు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు నిర్వహించబడతాయి.

# అత్యంత యవ్వనంగా 60 ఏళ్ల తాత..!

సింగపూర్ ఫ్యాషన్ ఫోటోగ్రాఫర్, మోడల్ చువాండో టాన్‌కి మార్చి 03, 2026న అధికారికంగా 60 ఏళ్లు నిండాయి. కానీ దశాబ్దాలుగా టీనేజ్ యువకుడిలా అందర్నీ ఆశ్చర్యపరుస్తుంటాడు. అతడి యంగ్‌లుక్ అందర్నీ విస్మయపరుస్తుంటుంది. కనీసం మచ్చుకైనా వృద్ధాప్య ఛాయలు ఎక్కడ కానరావు. అంతలా మెయింటైన్ చేస్తున్నా అతడి గ్లామర్ రహస్యం ఏంటో తెలుసుకోవాలన్న కుతుహలం అందరిలోనే రేకెత్తిస్తుంటుంది. మరి అంతలా యవ్వనంగా కనిపించాలంటే ఆహారపు అలవాట్లు ఎలా ఉండాలో తెలుసా..!?.

లైఫ్‌స్టైల్ ఎలా ఉంటుందంటే..

ఎలాంటి బ్యూటీ చికిత్సలు తీసుకోడు. దీర్ఘకాలిక క్రమశిక్షణయుత జీవనమే మేలు

బ్రేక్‌ఫాస్ట్:

గుడ్లు, తేనె, అవకాడోతో ప్రోటీన్ షేక్స్ లేదా ఓట్‌మీల్ అల్పాహారాన్ని తీసుకుంటానని తెలిపాడు.

లంచ్ లేదా డిన్నర్:

భోజనంలో సాధారణంగా ఉడకబెట్టిన లేదా కాల్చిన చికెన్ లేదా చేప, రసం విత్ రైస్ ఉంటాయి.

తప్పనిసరిగా వర్కౌట్‌లు. ఇవి కేలరీలు బర్న్ చేయడానికి సమతుల్యతను బ్యాలెన్స్ చేసేలా డైట్ అత్యంత ముఖ్యమని చెబుతున్నాడు.

పగటిపూట చేసే కార్యకలాపాలు ఆ రోజుల్లో మీరు బర్న్ చేసే కేలరీలకు సమానంగా ఉండాలని చెబుతున్నాడు.

నాణ్యమైన నిద్ర తప్పనిసరి. ఒత్తిడిలేని సానుకూల మనస్తత్వం అత్యంత ముఖ్యం. ఆరోగ్యమైన వృద్ధాప్యానికి ఇవి అత్యంత కీలకమని చెబుతున్నాడు టాన్.

అయితే తాను మద్యం, కాఫీ, చక్కెర పానీయాలకు దూరంగా ఉంటాడట.

వారానికి మూడు నుంచి ఐదు సార్లు బల శిక్షణ, కార్డియో వ్యాయామాలు, ఈత తదితరాలు ఉంటాయట.

కాగా, టాన్ ఇటీవల కొద్దికొద్దిగా వృద్ధాప్యంలో దరిచేరే కొద్దిపాటి శారీరక సమస్యలను ఎదుర్కొంటున్నట్లు తెలిపాడు. సహజంగా కాలంతో వచ్చే వృద్ధాప్యాన్ని ఆపలేమని, కాకపోతే దాన్ని హెల్దీగా మార్చుకుంటే..ఆరోగ్యకరమైన వార్ధక్య జీవితాన్ని గడపొచ్చని టాన్ చెబుతున్నాడు. అంతేగాదు అతడి పోస్ట్‌ల్లో సైతం ఆసక్తికరమైన



సందేశాలతో నెటిజన్లను ఆకట్టుకుంటాడు. వాటిని చూస్తే అవగతమవుతోంది ఫిట్‌నెస్ పట్ల ఎంత కేర్‌గా ఉంటాడనేది. కాగా, టాన్ తన పోస్ట్‌లో ఇలా రాసుకొచ్చారు. సమయాన్ని నిజమైన సంపదగా పేర్కొన్నాడు. ప్రతి సూర్యోదయం చూసేలా, అనుభవించేలా చేస్తున్నందుకు, ఇప్పటికీ ఈ భూమిపై ఉన్నందుకు సదా కృతజ్ఞుడును. ప్రతి రోజు ప్రకృతిలో గడపడం, సూర్యకాంతిలో గడపడం మిస్ చేసుకోవద్దు అని రాసుకొచ్చాడు పోస్ట్‌లో. సింపుల్‌గా చెప్పాలంటే సమయం, ఆరోగ్యం అత్యంత విలువైనవని, వాటిని నిర్లక్ష్యం చేస్తే.. అన్ని దూరమైపోతాయని చెప్పకనే చెప్పాడు టాన్.

# గూగుల్ ఫొటోస్‌కు మరిన్ని ఏఐ సొబగులు




గూగుల్ మరో కొత్త ప్రయోగాత్మక ఏఐ ఏజెంట్‌ను ఆవిష్కరించింది. దీని పేరు సీసీ. ఇది రోజూ ఉదయాన్నే ఈమెయిళ్లు, క్యాలెండర్ వివరాలు, ఇతర డాక్యుమెంట్లు అన్నింటినీ కలగలపి ఏఐ జనరేటెడ్ సారాంశాన్ని అందిస్తుంది. యువర్ డే హెడ్ అనే శీర్షికతో యూజర్ ఇన్‌బాక్స్‌లో బ్రీఫింగ్ ఇస్తుంది. ఆ రోజున చేయాల్సిన పనులు, కట్టాల్సిన బిల్లులు, అపాయింట్‌మెంట్ల వంటివన్నీ ఇందులో ఉంటాయి. ఈమెయిల్ డ్రాఫ్ట్‌ను జనరేట్ చేయటానికి, దానంతటదే గూగుల్ క్యాలెండర్‌కు ఈవెంట్స్‌ను యాడ్ చేయటానికీ దీన్ని వాడుకోవచ్చు. కస్టమ్ రిక్వెస్ట్‌తో నేరుగా మెయిల్ చేయటం లేదా జవాబు ఇవ్వటం ద్వారానూ సీసీకి ఆదేశాలు ఇవ్వచ్చు. మీ గురించి తెలుసుకునేలా దీనికి శిక్షణ ఇవ్వచ్చు కూడా. ఐడియాలు, చేయాల్సిన పనులను గుర్తుపెట్టుకోమనీ చెప్పొచ్చు. జెమినై సాయంతో ఏఐ మోడల్స్‌తో పనిచేసే ఇది జీమెయిల్, గూగుల్ క్యాలెండర్, గూగుల్ డ్రైవ్‌లను సింక్ చేయటంతో పాటు అంతర్జాలం నుంచి సమాచారాన్ని తీసుకోవటం ద్వారా యూజర్ల గురించి మరింత బాగా తెలుసుకోగలదు. మీ గురించి మరింత తెలుసుకునేలా తీర్చిదిద్దేలా చేసి, అవసరాలకు అనుగుణంగానూ సీసీని మలచుకోవచ్చు.

# ఈ చెట్టు వయసు 2200 సంవత్సరాలు!




అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో ఉన్న ాావ-quoia National Park లో ప్రపంచంలోనే పరిమాణం (వాల్యూమ్) ప్రకారం అతిపెద్ద చెట్టు ఉంది. దీనిని General Sherman Tree అని పిలుస్తారు. పార్క్‌లో వచ్చే సందర్శకులు ఒక చిన్న మార్గంలో నడుచుకుంటూ వెళ్లినప్పుడు అకస్మాత్తుగా ఈ భారీ చెట్టు కనిపిస్తుంది. దగ్గరగా చూసినప్పుడు దాని పరిమాణం ఎంత పెద్దదో అర్థమవుతుంది. ఈ చెట్టు సుమారు 275 అడుగుల ఎత్తు కలిగి ఉంటుంది. దాని వయస్సు దాదాపు 2,200 సంవత్సరాలు అని అంచనా. ఈ చెట్టు మొత్తం వాల్యూమ్ సుమారు 52,500 క్యూబిక్ ఫీట్ (దాదాపు 1,486 క్యూబిక్ మీటర్లు). అందువల్లే ఇది ప్రపంచంలోనే పరిమాణం పరంగా అతిపెద్ద చెట్టుగా గుర్తించబడింది. నేల దగ్గర ఈ చెట్టు చుట్టుకొలత సుమారు 102 అడుగులు, అడుగుభాగంలో వ్యాసం 36.5 అడుగులు ఉంటుంది. ఇంకా 180 అడుగుల ఎత్తులో కూడా దాని తుంగ వెడల్పు సుమారు 14 అడుగులు ఉంటుంది. ఈ చెట్టు Giant Sequoia అనే ప్రత్యేకమైన జాతికి చెందినది. ఈ జాతి చెట్లు చాలా ఎత్తుగా కాకపోయినా, చాలా భారీగా పెరుగుతాయి. జనరల్ షెర్మన్ చెట్టు తుంగ మాత్రమే దాదాపు 1,400 టన్నుల బరువు ఉంటుంది. ఇందులో ఉన్న కలప పరిమాణం సుమారు 630,000 బోర్డ్ ఫీట్. అటవీ నిపుణుల ప్రకారం ఇది సుమారు 120 ఇళ్లను నిర్మించడానికి సరిపడే కలప.

# కవల పాలపుంత!



మన పాలపుంతను పోలిన మరో గెలాక్సీని భారతీయ శాస్త్రవేత్తలు గుర్తించారు. విశ్వం ఏర్పడ్డాక 150 కోట్ల ఏళ్లలోనే ఇది పురుడు పోసుకోవటం విశేషం. ప్రస్తుతం విశ్వం వయసు 1380కోట్ల సంవత్సరాలు. అంటే శాస్త్రవేత్తలు పురాతన ప్రపంచానికి సంబంధించిన గెలాక్సీని చూస్తున్నారన్నమాట. దీనికి అలకనంద అని పేరు పెట్టారు. విశ్వం తొలినాళ్లతో ముడిపడిన నమ్మకాలకు అలకనంద విరుద్ధంగా ఉండటం ఆశ్చర్యపరుస్తోంది. విశ్వం పుట్టిన వెంటనే గెలాక్సీలు చాలావరకూ అస్తవ్యస్తంగా, చిందరవందరగా ఉండేవన్నది శాస్త్రవేత్తల నమ్మకం. అయితే శాస్త్రవేత్తలు జేమ్స్ వెబ్ టెలిస్కోప్‌తో స్కాన్ చేసి చూడగా, ఈ గెలాక్సీ పూర్తిస్థాయిలో వర్తులాకారంలో ఉన్నట్టు తేలింది. ఇది అచ్చం మన పాలపుంతను పోలి ఉందని ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ పత్రికలో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంది. పుణెలోని నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రోఫిజిక్స్ ఆఫ్ ద టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ (ఎన్‌సీఆర్ఏ-టీఐఎఫ్ఆర్)కు చెందిన పరిశోధక విద్యార్థిని రాశి జైన్ ఈ సంవత్సరం తొలినాళ్లలో అలకనందను గుర్తించారు. అనంతరం తన సూపర్‌వైజర్ వడడేకర్‌కు దీని గురించి తెలిపారు. మొదట్లో ఆయన నమ్మలేదు. మొత్తం 70వేల ఖగోళ వస్తువుల వివరాలను పరిశీలించగా ఇదొక్కటే వర్తులాకారంలో ఉంది మరి. సుమారు 30వేల కాంతి సంవత్సరాల విస్తీర్ణంలో పరచుకొని ఉన్న దీనికి రెండు సమానమైన చేతుల ఆకారాలున్నాయి. ఇవి మధ్యభాగంలోని డిస్క్ నుంచి పుట్టుకొని వస్తున్నాయి. వీటితో పాటు నక్షత్ర మండలాలు విస్తరించి ఉన్నాయి. పాలపుంతతో పోలిస్తే మూడింట ఒకవంతు సైజు గల ఇందులో వెయ్యికోట్ల నక్షత్రాలున్నాయి. పాలపుంతలో కనిపించే దాని కన్నా సుమారు 20-30 రెట్లు ఎక్కువ వేగంతో కొత్త నక్షత్రాలు పుడుతున్నాయనీ పరిశోధకులు చెబుతున్నారు. అలకనంద మీద మరిన్ని పరిశోధనలు చేయాలనీ భావిస్తున్నారు.

# ఝుంకారంతో మెదడు శుభ్రం!



తుమ్మెద ఝుంకారం ఎప్పుడైనా విన్నారా? అయితే ఓసారి విని చూడండి. వీలైతే మళ్లీ మళ్లీ వినటానికి ప్రయత్నించండి. ఎందుకంటే అల్జీమర్స్‌కు కారణమయ్యే విషతుల్యాలు మెదడులోంచి బయటకు రావటానికి తక్కువ పౌనఃపున్యం గల శబ్దాన్ని వినటం తోడ్పడుతున్నట్టు కోతులపై నిర్వహించిన అధ్యయనంలో బయటపడింది. ఈ ప్రయోగంలో కోతులకు 40 హెర్ట్జ్ (హెచ్‌జడ్) స్థాయి కూనిరాగాన్ని స్థిరంగా వినిపించారు. అప్పుడు వాటి మేరుద్రవంలో అల్జీమర్స్‌తో ముడిపడిన బీటా ఎమీలాయిడ్ అనే వ్యర్థ ప్రొటీన్ మోతాదులు పెరిగినట్టు గమనించారు. విషతుల్యాలను మెదడు మరింత సమర్థంగా శుభ్రం చేసుకుంటోందనటానికిది సూచిక కావటం గమనార్హం. మన వయసు మీద పడుతున్నకొద్దీ మెదడులోని నాడీకణాల చుట్టూ వ్యర్థ ప్రొటీన్ గూడు కడుతుంటుంది. ఇది నాడీ కణాల మధ్య సమాచార ప్రసారానికి ఆటంకం కలిగిస్తుంది. విషయగ్రహణ సామర్థ్యం దెబ్బతినేలా చేస్తుంది. సాధారణంగా మన మెదడు నిరాటంకంగా పనిచేస్తుంది. ఇందుకు సమ్మిళిత విద్యుత్ లయలు తోడ్పడతాయి. ఇవి వ్యర్థాలను శుభ్రం చేసే ప్రక్రియనూ నియంత్రిస్తాయి. కానీ అల్జీమర్స్‌లో ఈ లయలు బలహీనమై, అస్తవ్యస్తమవుతాయి. దీంతో మెదడులో వ్యర్థ ప్రొటీన్ పోగుపడటమూ ఎక్కువవుతుంది. దీన్ని తక్కువ పౌనఃపున్య శబ్దాలను వినటం ద్వారా తొలగించుకునే వీలుండటం నిజంగా గొప్ప విషయమే కదా.

# గోదావరి జిల్లాల సమాచారమ్

## పి.గన్నవరంలో బాలుడి అపహరణకు యత్నం



పి.గన్నవరం,న్యూస్‌టుడే: పి.గన్నవరంలో గురువారం ఓ బాలుడి కిడ్నాప్‌కు యత్నించిన ఘటన కలకలం సృష్టించింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడి తండ్రి, స్థానికులు, ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.గన్నవరం శివారు పితానివారిపాలేనికి చెందిన దొమ్మేటి మణికంఠ ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. సాయంత్రం పాఠశాల వదిలిన తర్వాత మరో విద్యార్థితో కలిసి ఇంటికి వెళ్తున్నాడు. ఇంతలో ద్విచక్రవాహనంపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. వెనుక కూర్చొన్న వ్యక్తి బాలుడి చేయి పట్టుకుని బండి ఎక్కమని బలవంతం చేశాడు. బాలుడు గట్టిగా ఏడవడంతో సమీపంలోనే ఉన్న గుడాల వెంకటరమణ అనే మహిళ గట్టిగా గట్టిగా కేకలు వేశారు. బాలుడు పరిగెత్తుకుని ఆమె వద్దకు రాగా, ఆ ఇద్దరూ బండిపై ఉడాయించారు. టోపీలు పెట్టుకుని, మాస్క్ ధరించారని వెంకటరమణ చెబుతున్నారు. పితానివారిపాలేనికి చెందిన తెదేపా నాయకుడు గుత్తుల రామకృష్ణ, బాలుడు మణికంఠ తండ్రి నాగరాజుతో కలిసి ఎస్సై బి.శివకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందిందని పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నామని, దాని బట్టి దర్యాప్తు చేస్తామన్నారు.

## అనారోగ్య సమస్యలపై అప్రమత్తత అవసరం



**కాకినాడ:** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడతాయని, ఉష్ణోగ్రతలు భారీగా పెరగనున్నాయని వాతావరణశాఖ ముందే హెచ్చరించింది. తద్వారా వచ్చే రుగ్మతల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. అమరావతిలో నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులో వాతావరణ మార్పులతో ఏయే ప్రాంతాలు ప్రభావితం కానున్నాయో వివరించారు.

**ఈ ఏడాది సైతం..**

కోనసీమ జిల్లాలో గతేడాది అత్యధికంగా 47.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఏడాది కూడా తీర ప్రాంత జిల్లాల్లో తీవ్రత ఎక్కువే. హాట్ స్పాట్‌లుగా గుర్తించి హెచ్చరికలు జారీచేయాలని.. ఉపశమన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాల ఏర్పాటు, సబ్‌సెంటర్లు, పీహెచ్‌సీల్లో తగినంత ఓఆర్ఎస్ నిల్వలు ఉంచాలి. తూర్పుగోదావరి జిల్లాలో మూడు పట్టణ స్థానిక సంస్థలు ఉండగా నీటి ఎద్దడి నివారణకు రూ.97 లక్షల నిధులు కేటాయించారు. కోనసీమపైనే ఎక్కువ ప్రభావం ఎందుకంటే.. కోనసీమ గోదావరి డెల్టా ప్రాంతం కావడంతో గాలిలో తేమ ఎక్కువ. చెమట త్వరగా ఆరదు. శరీరం చల్లబడదు. అందుకే వేడి ప్రభావం ఎక్కువ.

వ్యవసాయం, కొబ్బరి తోటల్లో ఎక్కువగా పనిచేస్తుంటారు. మత్స్యకారులు అధికం. ఎండలకు తోడు తగినంత నీరు తాగకపోవడం, విశ్రాంతి లేకపోవడం సమస్యకు కారణమవుతోంది. గతేడాదితో పోల్చితే కాకినాడలో 1.44 మీటర్ల మేర భూగర్భ జలాలు తగ్గాయి. కోనసీమలో స్థిరం. సోక్‌పిట్‌లు, ఇంకుడు గుంతలు, పంట కుంటలు, మేజిక్ డ్రెయిన్ల నిర్మాణాల్లో కాకినాడ జిల్లా వెనుకబడి ఉంది. ఇష్టారాజ్యంగా మైనింగ్, సాగునీటి వనరుల ఆక్రమణ జలాలు తగ్గుముఖం పట్టడానికి ఓ కారణం.

**గ్రామీణ ప్రాంతాల్లో 'క్రాష్'**

ఉమ్మడి జిల్లాలోని 60 మండలాల్లో క్రాష్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. చేతి పంపులు మొదలు బహుళ నీటి పథకాల నిర్వహణ, మరమ్మతులు, ఇతరత్రా పనులు చేపట్టి తాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నట్లు కాకినాడ జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అబ్దుల్ మతీన్ తెలిపారు.

## బిక్కుబిక్కుమంటున్న మన్యం..!



**ప్రత్తిపాడు, శంఖవరం,:** పెద్ద పులి ప్రత్తిపాడు నియోజకవర్గం మన్యంలో తిరుగుతోంది. ధారపల్లి జలపాతం నుంచి శంఖవరం మండలం శృంగధార మధ్య సంచరిస్తున్నట్లు గుర్తించారు. వాగుల సమీపంలోని ఇసుకతిన్నెల్లో పాదముద్రలు కనిపించాయి. గురువారం సాయంత్రం ప్రత్తిపాడు మండలం తాడువాయి సమీపంలో ఆవుదూడపై పులి దాడి చేసి వెళ్లింది. మూడు రోజుల విరామం తర్వాత బెబ్బులి వేటాడిన ఘటన ఇదే. అక్కడ ఉన్న కుటుంబాలను అటవీ అధికారులు సమీపంలోని జనావాసాలకు తరలించారు. పులి మెడకు ఉన్న కాలర్ ద్వారా ఐదారు గంటలకు దాని ఉనికి అందాల్సి ఉన్నా..అది సంచరిస్తున్న ప్రాంతాలలో సంకేతాలు అందని పరిస్థితి. దట్టమైన అడవివల్ల డ్రోన్ల ద్వారా జాడ తెలుసుకునే వీలు సాధ్యం కావడం లేదు. అటవీశాఖ ఏలేశ్వరం రేంజి, శంఖవరం సెక్షన్ పరిధిలోని బవురువాక అటవీ ప్రాంతంలోనే బెబ్బులి సంచరిస్తోంది. అడవి హద్దుగా ఉన్న గ్రామస్థులను పులి భయం వెంటాడుతోంది. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శృంగధార తదితర గ్రామాల్లో పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పారు.

## వాహనానికి రూ.65వేలు జరిమానా

**వాహనానికి పిఠాపురం:** పిఠాపురం సీఐ కార్యాలయం వద్ద అనకాపల్లి నుంచి నిశ్చితార్థానికి వచ్చిన బృందం ఆందోళనకు దిగింది. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. గురువారం అనకాపల్లి జిల్లా నాతవరానికి చెందిన ఏకా నాయుడు కుటుంబం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సులో సామర్లకోట మండలం మాధవపట్నంలో నిశ్చితార్థ వేడుకకు వచ్చారు. తిరిగి వెళ్తుండగా చిత్రాడలో కొందరు ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెంట్లు వేడుకలకు స్కూల్ బస్సులు వాడకూడదంటూ ద్విచక్ర వాహనాలపై వచ్చి వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ట్రావెల్ ఏజెంట్లు ఆర్టీఏకు సమాచారం ఇవ్వడంతో స్కూల్ బస్సుకు సరైన పత్రాలు లేవంటూ రూ.65 వేలు అపరాధ రుసుము విధించి సీజ్ చేశారు. ఆగ్రహించిన నాతవరం వాసులు పిఠాపురం సీఐ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం సీఐ శ్రీనివాస్ వారితో మాట్లాడి విచారణ చేయిస్తామని చెప్పడంతో వేరే బస్సులో అక్కడ నుంచి స్వస్థలాలకు పయనమయ్యారు. రూ.65వేలు జరిమానా

## శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిన నేతల ప్రసంగాలు

కాకినాడ: కాకినాడ వేదికగా బుధవారం జరిగిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం సూపర్ సక్సెస్ అవ్వడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపింది. చంద్రబాబు ప్రభుత్వం నుంచి, పాలకుల నుంచి అనేక అక్రమ పోలీసు కేసులు, వేధింపులు ఎదుర్కొంటున్నా లెక్క చేయకుండా రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీ అగ్ర నేతలు మొదలుకుని ద్వితీయ శ్రేణి నేతలు, పార్టీ శ్రేణులు ఉత్తుంగ తరంగాలై కాకినాడ తరలివచ్చారు. సమావేశానికి హాజరయ్యే వారి కోసం కాకినాడ సినిమా రోడ్డులోని సూర్యకళామందిర్‌లో ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద ఉదయం ఎనిమిది గంటలకే పార్టీ నేతలు క్యూ కట్టారు. కార్యవర్గ సమావేశం ఉదయం 9 గంటలకు ప్రారంభమైన అరగంటలోనే సమావేశ మందిరం సూర్యకళామందిర్ పార్టీ నేతలు, శ్రేణులతో నిండిపోయింది. కూర్చునేందుకు వీలులేక వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పార్టీ దళిత నేతలు హాలు బయటే ఉండిపోయారు. సమావేశం ప్రారంభమైన ఉదయం 9 గంటల నుంచి రాత్రి ఏడు గంటలకు ముగిసే వరకు పార్టీ శ్రేణులు శ్రద్ధగా ముఖ్యనేతల ప్రసంగాలను ఆలకించారు.

**అధికార పార్టీ దౌర్జన్యాలను తూర్పార బట్టిన నేతలు**

కాకినాడ వేదికగా జరిగిన సమావేశంలో వైఎస్సార్ సీపీకి వెన్నుదన్నుగా నిలుస్తోన్న దళితులపై చంద్రబాబు ప్రభుత్వంలో సాగిస్తున్న వేధింపులు, కక్ష సాధింపు చర్యలు, అక్రమ పోలీసు కేసులు, హత్యలు, అత్యాచారాలపై నేతలు ఉదాహరణలతో సహా కడిగి పారేశారు. మాల, మాదిగలను విడదీసి రాజ్యాధికారానికి దూరం చేసిన చంద్రబాబు కుట్రలను తిప్పికొట్టాలని జూపూడి, సుధాకర్‌బాబు వంటి నేతలు పిలుపు ఇచ్చినప్పుడు పార్టీ ఎస్సీ సెల్ నేతల నుంచి మంచి స్పందన లభించింది. రాజధాని అమరావతిలో భూములు లాగేసుకుని దళితులను వెళ్లగొట్టే కుట్రల దగ్గర నుంచి వైఎస్సార్ సీపీకి వెన్నుదన్నుగా నిలుస్తోన్న దళితులపై దౌర్జన్యాలకు పాల్పడుతోన్న అధికార పార్టీ నేతల తీరును నేతలు తూర్పార బట్టారు. ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు గ్రామ, గ్రామాన దళిత వర్గాలకు అవగాహన కల్పించాల్సి అవసరాన్ని పార్టీ నేతలు నూరిపోశారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా దళితులకు కల్పించిన ప్రయోజనాలు గణాంకాలతో సహా వివరించిన నేతలు ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పిన సందర్భంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన నేతలు జై జగన్, 2029లో జగనే సీఎం అంటూ నినాదాలు చేస్తూ కేరింతలు కొట్టారు. ఇందుకోసం అధికార పార్టీ నుంచి ఎదురయ్యే ఎన్ని కేసులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, మీ వెంట ఉంటామంటూ నేతలు కొండంత ధైర్యాన్నిచ్చారు. ఇందుకోసం దళితులంతా ఏకతాటిపైకి రావాల్సిన అవసరాన్ని తెలియజేశారు.

**అంబేడ్కర్ విగ్రహానికి అవమానాలపై ఆగ్రహం**

దళితుల జోలికొస్తే ఏం జరుగుతుందో సర్కార్‌కు తెలిసొచ్చేలా చేస్తామంటూ కార్యవర్గ సమావేశం డిక్లరేషన్‌లో చంద్రబాబుకు అల్టిమేటమ్ ఇచ్చారు. అమరావతి రాజధానిని కుల రాజధానిగా చేసిన వైనాన్ని సామాన్యులకు సైతం అర్థమయ్యేలా అవగాహన కల్పించే విషయంలో పార్టీ శ్రేణులంతా చొరవ తీసుకోవాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా నేతలు తమ ప్రసంగాల్లో సూటిగా తెలియచేశారు. దేశంలో ఎక్కడా లేని రీతిలో విజయవాడ స్వరాజ్ మైదానంలో జగన్ ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి కూటమి ప్రభుత్వంలో జరుగుతోన్న అవమానాలపై పార్టీ నేతలు ఒకే గొంతుకై నిరసించారు. సంపన్నులకు కాకుండా సామాన్యులైన దళితులకు జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన రాజకీయ ప్రాతినిధ్యాన్ని జూపూడి, మేరుగు నాగార్జున్, తాటిపర్తి చంద్రశేఖర్, మొండితోక అరుణ్‌కుమార్ వంటి నాయకులు వివరించే సందర్భంలో సూర్యకళామందిర్‌లో పార్టీ శ్రేణులు జై జగన్ నినాదాలు మిన్నంటాయి.

**సరికొత్త ఉత్తేజం**

దశాబ్దన్నర కాలం క్రితం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని జగ్గంపేటలో పార్టీ అధ్యక్షుడిగా జగన్‌మోహన్‌రెడ్డి పార్టీని ప్రకటించారు. ఈ అపూర్వమైన ఘట్టం ఆవిష్కృతమై 15 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో ఒక రోజు ముందు కాకినాడలో పార్టీ ఎస్సీ సెల్ సమావేశం జరగడం పార్టీ భవిష్యత్‌కు శుభసంకేతమంటూ నేతలు చర్చించుకోవడం కనిపించింది. నాడు పార్టీ జెండా, అజెండా ఇదే జిల్లా నుంచి ఆవిష్కృతం కావడాన్ని పార్టీ నేతలు ప్రస్తావించి పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్తేజాన్ని నింపారు. పార్టీ కార్యవర్గ సమావేశం చివర్లో పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో కొత్తగా 'జగనన్నకు తోడుగాఉరాజన్న రాజ్యం మళ్లీ సాధిద్దాం', 'జగనన్న దళిత ఫోర్స్ఉదళిత జాతి మేలుకో' అంటూ రూపొందించిన గీతం ఆహూతులైన పార్టీ శ్రేణులను అలరించింది. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు ఈ గీతాన్ని ఆవిష్కరించినదే తడవుగా పార్టీ శ్రేణులు కేరింతలు కొడుతూ ఊగిపోయారు. శ్రేణులు ఉత్సాహంతో పార్టీ కండువాలతో గీతానికి లయబద్ధంగా నృత్యాలు చేశారు. మొత్తంగా పార్టీ ఎస్సీ సెల్ సమావేశం పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది.

**వైఎస్సార్ సీపీకి వెన్నుదన్నుగా దళితులు**

దళితులు వైఎస్సార్ సీపీకి వెన్నెముకగా నిలిచారనే పోలీసులతో అక్రమ కేసులు పెట్టిస్తున్నారు. దళితులపై దౌర్జన్యాలు పెరిగిపోయాయి. దళిత ఉన్నతాధికారులకూ వేధింపులు తప్పడం లేదు. అబద్ధాలు చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. దళిత క్రిస్టియన్లను అన్ని విధాలా మోసం చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. దళితులంతా కలిసి కట్టుగా ఉంటే రాజ్యాధికారం సాధించవచ్చు.

**- తలారి వెంకట్రావు,**
**మాజీ ఎమ్మెల్యే, గోపాలపురం**

**గన్‌ను సీఎం చేసేందుకు దళితులు శ్రమించాలి**

గ్రామ గ్రామాన పర్యటించి వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడంతో పాటు జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు దళితులంతా శ్రమించాలి. మనందరి గోల్ జగన్‌ను సీఎంను చేయడమే. ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఎస్సీలంటే గౌరవంతో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. అదే స్ఫూర్తితో జగన్‌మోహన్‌రెడ్డి అంతకు మించి చేసి మెడికల్ కాలేజీలు పెట్టారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తోంది. జగన్ పార్టీ రహితంగా అనేక సంక్షేమ పథకాలు వర్తింపజేశారు. గ్రామాలలో వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో దళితులు ఉన్నత చదువులు, ఉద్యోగాలు సాధించారు.

-పాముల రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే

**ఇంగ్లిష్ మీడియాన్ని దూరం చేశారు**

తరతరాలుగా అణచివేతకు గురవుతున్న దళితులను అన్నివిధాలా ఆదుకున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే. రాష్ట్రంలో ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు పెట్టి దళితులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఘనత జగన్‌ది. అదే పేదలకు ఇంగ్లిష్ మీడియాన్ని దూరం చేసింది చంద్రబాబు. వైఎస్సార్ సీపీ హయాంలో హోంమినిస్టర్ తానేటి వనిత చాలా హుందాగా వ్యవహరించేవారు. ప్రస్తుత హోంమినిష్టర్ అనిత తాను సొంతంగా మాట్లాడలేని స్థితిలో ఉన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు చనిపోతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. కూటమి మంత్రుల మాటలు ఆకాశాన్నంటుతున్నాయి. దళితులను చంద్రబాబు ప్రభుత్వం అన్ని రకాలుగా అణగదొక్కుతోంది.

**- జక్కంపూడి విజయలక్ష్మి**

పీఏసీఎస్ సభ్యురాలు ప్రజలను మోసం చేశారు

ఒక అబద్ధం అనేకసార్లు చెప్పి ప్రజలను మోసం చేశారు. ఈ ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా నాయకులు పార్టీలు మారారు తప్ప, ఒక్క కార్యకర్త కూడా పార్టీ మారలేదు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని మట్టి కరిపించి వైఎస్సార్ సీపీ విజయానికి ఎస్సీలందరూ కలిసికట్టుగా పనిచేస్తారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే ఎస్సీల తలరాతలు మారతాయి.

**- అంగులూరి లక్ష్మీకుమారి, మాజీ ఎమ్మెల్సీ**

## గుంపులు గుంపులుగా స్వైర విహారం



రాజమహేంద్రవరంలో ఇటీవల 15 మందిపై పిచ్చి కుక్క దాడి చేసింది. తీవ్ర గాయాలై జీజీహెచ్‌లో చికిత్స పొందారు. జిల్లాలో ఏ పట్టణంలో చూసినా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీటి నియంత్రణపై యంత్రాంగం దృష్టిసారించడం లేదు. అత్యధికంగా రాజమహేంద్రవరంలో 15,865 వీధి కుక్కలు ఉన్నాయి. అనధికారికంగా ఈ సంఖ్య 25వేలకు పైగా ఉంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులు మరింత ఆందోళనకు గురవుతున్నారు.

**పట్టింపులేని ఆదేశాలు**

వీధి కుక్కల నియంత్రణకు గతంలో సర్వోన్నత న్యాయస్థానం పలు సూచనలు చేసింది. వీటి అడ్డుకట్టకు కలెక్టర్ల నేతృత్వంలో పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక కమిటీలు వేయాలి.

జాతీయ జంతు సంరక్షణ కేంద్రానికి కమిటీలు అనుబంధంగా పని చేయాలి. ప్రతి పట్టణంలో యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ)

**కేంద్రాలు ఏర్పాటు తప్పనిసరి.**

వీధి కుక్కలకు నిత్యం కు.ని శస్త్ర చికిత్సలు చేయాలి. జబ్బులతో ఉన్న కుక్కలకు వైద్యం అందించాలి. రేబీస్ ఉన్న వాటిని గుర్తించి ఏబీసీ కేంద్రాలకు తరలించాలి. జిల్లాలోని కొన్ని చోట్ల మాత్రమే ఏబీసీ కేంద్రాలు ప్రారంభించారు. ఆ తర్వాత ర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిధులు విడుదలైనా నిర్వహణ మాత్రం తూతూ మంత్రంగానే సాగుతోంది. కరోనా తర్వాత ఈ ప్రక్రియ అంతా నిలిచిపోయింది. గత ప్రభుత్వంలో ఈ విధానం పూర్తిగా పక్కన పెట్టేశారు.

నిడదవోలు, కొవ్వూరు పురపాలికల్లో కోర్టు ఆదేశాలు బేఖాతరు చేశారు. కనీసం ఎన్ని కుక్కలు ఉన్నాయనే దానిపై కూడా అక్కడ లెక్కలు లేకపోవడం గమనార్హం.

**ఇదీ పరిస్థితి**

రాజమహేంద్రవరంలో కు.ని.శస్త్ర చికిత్సలకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. క్వారీ సెంటర్‌లో ఏబీసీ కేంద్రం ఉంది. బాధితుల కోసం కమాండ్ కంట్రోల్ రూమ్ నంబరు ప్రకటించారు. అయితే కాల్ చేస్తే స్పందించిన దాఖలాలు లేవు.

**స్పందించని యంత్రాంగం**

తాజాగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక కేంద్రం సాయంతో వ్యాక్సినేషన్, ఏబీసీ ఆపరేషన్లు చేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పించినా యంత్రాంగం ముందుకు కదలడం లేదు.

## మోసగించి మరో పెళ్లి చేసుకున్న వ్యక్తిపై వివాహిత ఫిర్యాదు

సర్పవరం, న్యూస్‌టుడే: తనను పెళ్లి చేసుకున్న వ్యక్తి విభేదాల కారణంగా విడాకులు తీసుకోకుండా మరో పెళ్లి చేసుకున్నాడని వివాహిత ఇచ్చిన ఫిర్యాదుపై సర్పవరం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ పెద్దిరాజు వివరాల ప్రకారం.. కాకినాడ గ్రామీణానికి చెందిన దేవి చిరుద్యోగిని. అప్పటికే భర్త నుంచి విడాకులు తీసుకున్న ఈమె.. సామర్లకోట మండలానికి చెందిన మణికంఠను ప్రేమించి 2021లో పెళ్లి చేసుకున్నారు. ఇద్దరి మధ్య కొంతకాలంగా విభేదాలున్నాయి. ఇటీవల మణికంఠ తనకు రూ.5 లక్షలు ఇవ్వాలని, లేదంటే తన మేనకోడలిని పెళ్లి చేసుకుంటానని బెదిరిస్తూ.. వేధిస్తున్నాడని దేవి ఫిర్యాదు చేయగా 2024లో సర్పవరం స్టేషన్‌లో కేసు నమోదు కాగా మణికంఠకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ఇటీవల ఈ కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.



మణికంఠ, అతని కుటుంబ సభ్యులు తనను దూషించి, దాడి చేశారని, వారి నుంచి ప్రాణహాని ఉందని, మణికంఠ తన మేనకోడలిని వేరేచోట వివాహం చేసుకున్నాడని తాజాగా దేవి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా దేవిపై మణికంఠ దాడి చేస్తున్నట్లు వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. అందులోని వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 25న మణికంఠను రెండో పెళ్లి ప్రయత్నాలపై నిలదీయగా రెండు నెలల గర్భిణి అని కూడా చూడకుండా తనను రోడ్డు మీదనే విచక్షణారహితంగా కొట్టి ప్రాణాలు తీసే ప్రయత్నం చేశాడని, తనతో అప్పులు చేయించి మోసగించాడని, ఈ నెల 5న మేనకోడలితో కుటుంబసభ్యులు వివాహం చేశారని దేవి ఆరోపించింది.

## అవయవ దానంపై అవగాహన ర్యాలీ

**ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం):** కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) నగర శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవయవ దానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎస్పీ ఎస్.భవ్య కిషోర్ జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక సౌత్ జోన్ డీఎస్పీ కార్యాలయం నుంచి ఆజాద్ చౌక్ మీదుగా దేవీచౌక్ వరకూ ప్రదర్శన కొనసాగింది. డీఎస్పీ మాట్లాడుతూ ఒక వ్యక్తి చనిపోయిన తర్వాత అతడి అవయవాలను దానం చేయడం ద్వారా ఎనిమిది మందికి కొత్త జీవితాన్ని ప్రసాదించవచ్చన్నారు. సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ ఈ ఏడాది పీఎంపీ అసోసియేషన్ ద్వారా అన్ని మండలాల్లో అవయవదానంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి చిన్ని, మండల అధ్యక్షుడు అబ్దుల్ రహ్మాన్ ఖాన్, కార్యదర్శి మట్టా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 31 రూర్బన్ పంచాయతీలు

**రాజమహేంద్రవరం రూరల్:** జిల్లాలో పదివేల మందికి పైగా జనాభా, రూ.కోటికి పైగా ఆదాయం ఉన్న పంచాయతీలను రూర్బన్ పంచాయతీలుగా ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇలా జిల్లాలోని 31 పంచాయతీలకు గుర్తింపు లభించింది. అలాగే గ్రేడ్ ఉ 1 పంచాయతీలుగా 167, గ్రేడ్ ఉ 2గా 75, గ్రేడ్ఉ3గా 69 పంచాయతీలు ఆమోదం పొందాయి. రూర్బన్ పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీవో స్థాయి అధికారిని కార్యదర్శిగా నియమించనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోపు వీటిలో కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. ధవళేశ్వరం, రాజవోలు, బొమ్మూరు, హుకుంపేట, పిడింగొయ్యి, శాటిలైట్‌సిటీ, కోలమూరు, కాతేరు, కడియం, వేమగిరి, కడియపులంక, రాజానగరం, దివాన్‌చెరువు, పాలచర్ల, చెల్లూరు, కేశవరం, ఏడిద, ద్వారపూడి, అనపర్తి, బిక్కవోలు, బలభద్రపురం, చాగల్లు, దేవరపల్లి, గోకవరం, గోపాలపురం, నల్లజర్ల, పోతవరం, ఖండవల్లి, పాలంగి, ఉండ్రాజవరం, వేలివెన్ను రూర్బన్ పంచాయతీలుగా మారాయి.

## ఏప్రిల్ 25న పాలిసెట్

**రాజమహేంద్రవరం రూరల్:** పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే పాలిసెట్‌ను ఏప్రిల్ 25న నిర్వహించనున్నట్లు బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, హెల్ప్‌లైన్ సెంటర్ జిల్లా కో ఆర్డినేటర్ ఆకుల మురళి అన్నారు. ఆ కళాశాల ఆవరణలో బుధవారం పాలిసెట్ పోస్టర్లను లెక్చరర్లతో కలిసి ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల్లోని 14 కేంద్రాల్లో సుమారు 8 వేల మంది విద్యార్థుల వరకూ పరీక్ష రాయనున్నారన్నారు. ఈ ఏడాది నుంచి నిడదవోలు, తుని ప్రాంతాల్లో కూడా కొత్తగా పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్ష రాసే విద్యార్థులకు తమ కళాశాలలో ఏప్రిల్ 2 నుంచి 23వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు.

## రెండో రోజూ కొనసాగిన ఏసీబీ తనిఖీలు

**రాజమహేంద్రవరం సిటీ:** అవినీతికి అడ్డాగా మారిందనే ఆరోపణల నేపథ్యంలో రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో ఏసీబీ అధికారులు రెండో రోజు బుధవారం తనిఖీలు కొనసాగించారు. డీఎస్పీ కిశోర్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు సతీష్, వాసుకృష్ణ, భాస్కర్, మరో 20 మంది సిబ్బందితో ఉదయం నుంచి రాత్రి వరకూ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు కీలకమైన డాక్యుమెంట్లతో పాటు టౌన్ ప్లానింగ్ విభాగంలోని అన్ని శాఖలను తమ అధీనంలోకి తీసుకున్నారు. సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్, సర్వేయర్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ తదితర అధికారులు, సిబ్బందికి చెందిన మొబైల్ ఫోన్లను స్వాఽధీనం చేసుకున్నారు. అవినీతికి ఆస్కారం ఉన్న 20 డాక్యుమెంట్లను గుర్తించినట్టు సమాచారం.

## సేవా కార్యక్రమాల్లో మహిళలు



సొంత లాభం కొంత మానుకుని.. పొరుగువారికి సాయపడవోయ్ అనే సూక్తిని నిజం చేస్తున్నారీ మహిళలు. ఇంటి ఖర్చులు ఆదా చేసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పొదుపు సొమ్ముతో పేదలు, దివ్యాంగులు, వృద్ధులు తదితరులకు అవసరాలు తీర్చుతున్నారు. కొన్నేళ్లుగా సేవలు కొనసాగిస్తుండడం విశేషం.

**సామాజిక మాధ్యమం వేదికగా..**

కాకినాడ గ్రామీణం రమణయ్యపేట పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు లక్ష్మీ పారాయణం గ్రూప్ పేరుతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడానికి 10 మంది మహిళలతో ప్రారంభించారు. ప్రస్తుతం 115 మందికి చేరింది. పేదలు, దివ్యాంగులకు సేవలందించాలనే తలంపుతో పితాని లక్ష్మీకుమారి అధ్యక్షురాలిగా మేము సైతం అనే పేరుతో స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు.. తొమ్మిదేళ్లుగా సభ్యులు, దాతల సహకారంతో ప్రతి శుక్రవారం గైగోలుపాడు దుర్గాలమ్మ ఆలయం వద్ద 200 మంది నిరుపేదలకు భోజనాలు అందిస్తున్నారు. దాతల సాయానికి సభ్యులు కూడా ఖర్చు భరిస్తుండడం విశేషం. అలా నెలనెలా దివ్యాంగులకు బియ్యం, నిత్యావసరాలు ఇస్తున్నారు. కరెడ్ల లక్ష్మి, పితాని భారతి, దవులూరి వాణి, బి.మాధవి, గోబేరు సుజాత ప్రతివారం కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా సేవలు అందిస్తున్నారు. వీరిని చూపి పలువురు ముందుకొస్తున్నారు.

**పొదుపు సొమ్ముతో సాయం..**

కాకినాడకు చెందిన దూలం అలివేలు మంగతాయారు స్నేహితులతో కలిసి నాలుగేళ్ల కిందట 'ది యూనివర్స్ బెస్ట్ కిట్టీ సేవా సంస్థ' పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 24 మంది సభ్యులు నెలకు కొంత సొమ్ము పొదుపు చేస్తున్నారు. సేవలు చూసి దేశవిదేశాల్లో ఉన్న వీరి స్నేహితులు, బంధువులు సహకారం అందిస్తున్నారు. విజయవాడ పరిధిలోని సింగ్‌నగర్‌లో వరదలప్పుడు బాధితులకు కూరగాయలు, సరకులు అందించారు. నిరుపేద కుటుంబాలకు నెలవారీ నిత్యావసరాలు అందిస్తున్నారు. ఉచిత కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు స్వయం ఉపాధికోసం కుట్టుమిషన్లు ఇస్తున్నారు. బోన్ మ్యారో శస్త్రచికిత్స నిమిత్తం ఒక వ్యక్తికి రూ.1,25,000 సాయం అందించారు. గతేడాది కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరిగినప్పుడు 300 మంది అభ్యర్థులకు భోజనాలు కల్పించారు. ఏటా వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ, తాగునీరు పంపిణీ చేస్తున్నారు. గోశాలో నోరులేని మూగజీవాలకు గ్రాసం అందిస్తున్నారు. మల్లేశ్వరి, నాగలక్ష్మి, వరలక్ష్మి, అనిత, లక్ష్మి, సావిత్రి, రమాదేవి తదితరులు ఉత్సాహంగా సేవల్లో పాల్గొంటున్నారు.




## ఓటీటీ స్ట్రీమింగ్ కి సిద్ధమైన కపుల్ ఫ్రెండ్లీ..



టాలీవుడ్ యంగ్ హీరో సంతోష్ శోభన్, అందాల భామ మానస వారణాసి జంటగా నటించిన క్యూట్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'కపుల్ ఫ్రెండ్లీ'. వాలంటైన్స్ డే కానుకగా థియేటర్లలోకి వచ్చి యువత మనసు గెలుచుకున్న ఈ సినిమా, ఇప్పుడు డిజిటల్ స్క్రీన్స్‌పై సందడి చేసేందుకు రెడీ అయిపోయింది. నెల ముందు బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం లో కపుల్స్ మధ్య ఉండే చిన్న చిన్న గొడవలు, వాళ్ళ ప్రేమను చాలా సహజంగా ఇందులో చూపించారు. మరి ఈ సినిమా ఎప్పుడు, ఎక్కడ స్ట్రీమింగ్ కానుందో తెలుసుకుందామా..ఈ సినిమా గతేడాది ఫిబ్రవరి 14న ఏమాత్రం అంచనాలు లేకుండా విడుదలైంది. మొదట్లో వసూళ్లు అంతంత మాత్రంగానే ఉన్నా, చిత్ర బృందం ఒక మాస్టర్ ప్లాన్ వేసింది. మన 'రెబల్ స్టార్' ప్రభాస్‌తో మూవీ టీమ్ ఒక స్పెషల్ ఇంటర్వ్యూ చేయించింది. ఇంకేముంది, ఆ ఇంటర్వ్యూ తర్వాత సినిమాకి మంచి బజ్ క్రియేట్ అయ్యి, కలెక్షన్లు మెల్లగా పుంజుకున్నాయి. అలా డీసెంట్ నంబర్లతో థియేట్రికల్ రన్‌ను ముగించుకున్న ఈ చిత్రం, ఇప్పుడు నెల తిరగకముందే ఓటీటీ ప్రియులను పలకరించేందుకు వచ్చేస్తోంది. ఈ రొమాంటిక్ కామెడీ డ్రామాను చూడాలనుకునే వారికి ఒక గుడ్ న్యూస్. మార్చి 13 (శుక్రవారం) నుంచి ఈ సినిమా ప్రముఖ ఓటీటీ సంస్థ 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో స్ట్రీమింగ్ కానుంది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళ భాషలో కూడా అందుబాటులో ఉండటం విశేషం. వీకెండ్‌లో ప్రశాంతంగా కూర్చుని ఒక మంచి లవ్ స్టోరీ చూడాలనుకునే వారికి 'కపుల్ ఫ్రెండ్లీ' బెస్ట్ ఆప్షన్ అని చెప్పొచ్చు.

సినిమా కథ విషయానికొస్తే.. నెల్లూరు కుర్రాడు శివ (సంతోష్ శోభన్) ఉద్యోగం కోసం చెన్నై వెళ్తాడు. అక్కడ జాబ్ దొరక్కపోవడంతో పార్ట్ టైమ్ బైక్ రైడర్‌గా పని చేస్తుంటాడు. ఇక ఈ క్రమంలోనే మిత్ర (మానస వారణాసి) పరిచయమవుతుంది. ఆమెది కూడా శివ లాంటి కథే, ఇంట్లో వాళ్లకు అబద్ధం చెప్పి సిటీలో బతికేస్తుంటుంది. ఇక అనుకోని పరిస్థితుల్లో వీరిద్దరూ ఒకే ఇంట్లో కలిసి ఉండాల్సి వస్తుంది. మరి పెళ్లి కాకుండానే కలిసి ఉన్న ఈ జంట జీవితం ఏ మలుపు తిరిగింది? వీరి ప్రేమ కథ సుఖాంతమైందా అనేది చాలా ఇంట్రెస్టింగ్‌గా, సరదాగా సాగుతుంది. ఇక సంతోష్ శోభన్ తన సహజమైన నటనతో ఎప్పుడూ ఆకట్టుకుంటారు, ఈ సినిమాలో కూడా ఆయన నటన హైలైట్‌గా నిలిచింది. ఓటీటీలో ఇలాంటి యూత్ ఫుల్ సినిమాలు బాగా క్లిక్ అవుతుంటాయి, కాబట్టి ప్రైమ్ వీడియోలో ఈ సినిమా మంచి వ్యూస్ సాధించే అవకాశం ఉంది అంటున్నారు ఫాన్స్.

## సుకుమార్ కు ఇంకా టైమ్ కావాలా?



టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొల్పుతున్న కాంబినేషన్లలో రామ్ చరణ్– సుకుమార్ జోడీ ఒకటి. వీరి కలయికలో గతంలో వచ్చిన రంగస్థలం బ్లాక్‌బస్టర్‌గా నిలిచి బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. ఆ సినిమా తర్వాత ఈ ఇద్దరూ మళ్లీ కలిసి పని చేస్తారని తెలిసినప్పటి నుంచి అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌ను =జ17గా పిలుచుకుంటున్న సంగతి తెలిసిందే.

ఇటీవల ఈ సినిమా గురించి పలు వార్తలు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి. ముఖ్యంగా డైరెక్టర్ సుకుమార్ ఈ సినిమా స్క్రిప్ట్ ను ఇంకా ఫైనల్ చేయలేదన్న టాక్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కథపై ఆయన మరింత ఎక్కువగా పని చేస్తున్నారని, అందులో భాగంగానే ఒకటికి రెండు కథలను రెడీ చేశారని అంటున్నారు. త్వరలోనే ఆ రెండు కథలను రామ్ చరణ్‌కు వినిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ ప్రాజెక్ట్ ఏ దిశగా వెళ్లబోతుందన్న ఆసక్తి అభిమానుల్లో మరింత పెరిగింది.

అసలు ఈ చర్చలకు కారణం ఇటీవల వచ్చిన కొన్ని రూమర్లు. సుకుమార్ టీమ్‌లోని ఒక అసిస్టెంట్ డైరెక్టర్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సినిమా స్క్రిప్ట్ గురించి ఊహాగానాలు మొదలయ్యాయి. దీంతో =జ17 కథ ఏ స్థాయిలో ఉందన్న ప్రశ్నలు కూడా మొదలయ్యాయి. అయితే ఈ విషయాలపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. పుష్ప2 తర్వాత సుకుమార్ తన తర్వాతి సినిమాపై ఫోకస్ చేయడానికి అతనికి ఎక్కువ టైమ్ దొరికిందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ ఏడాదిన్నర టైమ్ కూడా సుకుమార్ కు సరిపోకపోవడం వల్లే ఆర్సీ17 ఫైనల్ స్క్రిప్ట్ ఇంకా రెడీ అవలేదా అనే డిస్కషన్స్ కూడా మొదలయ్యాయి.

చరణ్ బర్త్ డే నాడు అనౌన్స్‌మెంట్? అయితే ఇప్పుడు చరణ్ ఫ్యాన్స్ కళ్లన్నీ మార్చి 27 పైనే ఉన్నాయి. మార్చి 27న చరణ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా గురించి అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని అందరూ దాని కోసం వెయిట్ చేస్తున్నారు. సాధారణంగా టాలీవుడ్ లో స్టార్ హీరోల బర్త్ డే సందర్భంగా వారి నెక్స్ట్ ప్రాజెక్టులను అనౌన్స్ చేసే సంప్రదాయం ఇండస్ట్రీలో ఉంది. ఈ నేపథ్యంలోనే =జ17పై ఆ రోజున అప్డేట్ వచ్చే అవకాశముంటుందని ఆశ పడుతున్నారు. ప్రస్తుతం రామ్ చరణ్, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో పెద్ది అనే విలేజ్ బ్యాక్ డ్రాప్ స్పోర్ట్స్ డ్రామా చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆ సినిమా పనులతో బిజీగా ఉన్న చరణ్, అది పూర్తైన వెంటనే సుకుమార్ సినిమాను చేయనున్నారు. అయితే =జ17 అనౌన్స్‌మెంట్ గురించి ఇప్పటివరకు ఎలాంటి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాలేదు.

## ఏంటి నవీన్.. నెక్ట్స్ ఇంకా ఫిక్స్ అవ్వలేదా?



టాలీవుడ్ యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి.. రీసెంట్ గా అనగనగా ఒక రాజు మూవీతో వచ్చి సూపర్ హిట్ అందుకున్న విషయం తెలిసిందే. మారి దర్శకత్వం వహించిన ఆ సినిమాను సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై నాగవంశీ నిర్మించారు. అయితే థియేటర్స్ తో పాటు ఓటీటీలో ఆ మూవీ అదిరిపోయే రెస్పాన్స్ అందుకుంది. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించిన ఆ సినిమా.. ఓటీటీలో పెద్ద ఎత్తున వ్యూస్ సొంతం చేసుకుంది.

నిజానికి అనగనగా ఒక రాజు మూవీ.. అప్పుడెప్పుడో రిలీజ్ కావాల్సి ఉంది. కానీ వివిధ కారణాలతో లేట్ అవుతూ.. సంక్రాంతికి కానుకగా థియేటర్స్ లో రిలీజ్ అయింది. అయితే ఆ సినిమా విడుదలై రెండు నెలలు కావస్తున్నా.. నవీన్ నెక్ట్స్ మూవీ ఏంటన్నది ఇప్పటి వరకు క్లారిటీ లేదు. ఎలాంటి అధికారిక ప్రకటన కూడా రాలేదు. సోషల్ మీడియాతో పాటు సినీ వర్గాల్లో రూమర్స్ కూడా వినిపించడం లేదు. దీంతో నవీన్ ఇప్పుడేం చేస్తున్నారోనని.. అప్ కమింగ్ మూవీ ఎవరితో చేస్తారోనని అంతా ఇప్పుడు డిస్కస్ చేసుకుంటున్నారు. అయితే ఎవరైనా హీరో హిట్ కొడితే.. కచ్చితంగా వెంటనే నెక్ట్స్ మూవీ అనౌన్మెంట్ వస్తుంది. పలువురు డైరెక్టర్లు.. తమ స్టోరీస్ ను వినిపించేందుకు ఆసక్తి చూపుతుంటారు. మంచి ఛాన్స్ అందుకుని సదరు హీరో హిట్ ట్రాక్ ను రిపీట్ చేయాలని ప్లాన్ చేసుకుంటూ ఉంటారు. కానీ ఇప్పుడు నవీన్ పోలిశెట్టితో సినిమా చేసేందుకు టాలీవుడ్ డైరెక్టర్స్ లో పెద్దగా ఎవరూ ముందుకు రావడం లేదని ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. ఆయనతో మూవీ చేసి బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకోవాలనే కోరిక ఉన్నా కూడా.. కాస్త ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. నవీన్ కు సూపర్ మార్కెట్ ఉన్నా.. ఒకే ఒక్క కారణంతోనే ఆగుతున్నారని తెలుస్తోంది. అదేంటంటే.. సినిమా ప్రొడక్షన్ లో సాధారణంగా చాలా మంది హీరోలు తమ పాత్రకు సంబంధించిన విషయాలపై మాత్రమే సూచనలు ఇస్తారు. అయితే నవీన్ పోలిశెట్టి మాత్రం కథ, స్క్రీన్ ప్లే, షూటింగ్, నేరేషన్ తీరు వంటి అంశాల్లో ఫుల్ గా ఇన్వాల్వ్ అవుతారని ఎప్పటి నుంచో ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. రీసెంట్ గా అనగనగా ఒక రాజు మూవీ విషయంలో కూడా సేమ్ అంతేనని వార్తలు వచ్చాయి. దీంతో నవీన్ తీరు కొందరు డైరెక్టర్స్ కు నచ్చడం లేదని.. అందుకే సినిమా చేయాలని ఆసక్తి ఉన్నా.. సైలెంట్ గా ఉంటున్నారని రూమర్స్ వినిపిస్తున్నాయి. ఏ సినిమాకు అయినా హీరో ఇచ్చే సజెషన్స్ అవసరమే అయినా.. మరీ అన్ని విషయాల్లో ఇన్వాల్వ్మెంట్ కరెక్ట్ కాదని అభిప్రాయపడుతున్నారట. అందులో నిజమెంతో తెలియకపోయినా.. టాక్ మాత్రం వినిపిస్తోంది. అందుకు బలం చేకూరేలా కొత్త చిత్రం అనౌన్మెంట్ కూడా రావడం లేదు. మరి అసలేం జరుగుతుందో.. నవీన్ అప్ కమింగ్ మూవీ ఏంటో.. ఎవరితో వర్క్ చేస్తారో..అనేది వేచి చూడాలి.

## స్వేచ్ఛాయుత వాతావరణం యువతకు కల్పించాలి

**ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్**

**ఆంధ్రవిశ్వవిద్యాలయం, మార్చి 13:**
ఆంధ్రా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇన్ క్లూజన్ సోషల్ వర్క్ విభాగం సంయుక్తంగా "యువత మానసిక ఆరోగ్యం మరియు సామాజిక సమ్మిళితం" అనే అంశంపై ప్రత్యేక సదస్సును నిర్వహించాయి. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తూ యువతను ఒత్తిడికి దూరంగా ఉంచాలని సూచించారు. నేటి యువత విద్యాపరమైన ఒత్తిడి, సామాజిక అంచనాలు, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక ఆందోళనలు మరియు వ్యక్తిత్వ గుర్తింపు వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా యువతను లక్ష్యంగా చేసుకుని అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. విద్యార్థులు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ఉపాధి పొందేందుకు తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, సమాజంలో సమ్మిళిత వాతావరణం ఉన్నప్పుడే యువత సురక్షితంగా, గౌరవప్రదంగా, శక్తివంతంగా ఎదుగుతారని ఆయన అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సోషల్ వర్క్ విభాగాధిపతి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్. హరనాథ్ మాట్లాడుతూ, "ఒంటరితనానికి సామాజిక సమ్మిళితమే పరిష్కారం" అని పేర్కొన్నారు. సమాజంలో తమకు గుర్తింపు, గౌరవం లభిస్తున్నాయనే భావన యువత మానసిక ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. యువత మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడం అనేది కుటుంబాలు, పాఠశాలలు, ప్రభుత్వాలు మరియు సామాజిక సంస్థల ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. CSSI డైరెక్టర్ డాక్టర్ పి. సుబ్బారావు మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా యువత ఒత్తిడి, ఆందోళన, నిరాశ, ఒంటరితనం మరియు మానసిక అస్థిరత వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇవి వారి వ్యక్తిగత జీవితాలనే కాకుండా, విద్యా ప్రగతి, ఉపాధి అవకాశాలు మరియు సామాజిక భాగస్వామ్యంపై కూడా ప్రభావం చూపుతాయని వివరించారు.

గౌరవ అతిథి గా కార్యక్రమంలో పాల్గొన్న మిజోరాం యూనివర్సిటీ సోషల్ వర్క్ ప్రొఫెసర్ డాక్టర్ కె. శేఖర్ మాట్లాడుతూ, యువత అభివృద్ధికి పాఠశాలల్లో కౌన్సెలింగ్ సేవలను అందించడం, స్వేచ్ఛగా చర్చించే వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. నాయకత్వ లక్షణాలు మరియు నిర్ణయాధికార ప్రక్రియల్లో యువతను భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్య వక్తగా కార్యక్రమంలో పాల్గొన్న మిజోరాం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గ్రేస్ లాలాపుయ్ సైలో మాట్లాడుతూ యువత ఎదుర్కొనే ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలకు గల కారణాలను వివరించారు. యువతకు సరైన మద్దతు లభించినప్పుడు వారు ఆత్మవిశ్వాసం గల వ్యక్తులుగా ఎదుగుతారని ఆమె అన్నారు. మానసిక ప్రశాంతత కోసం, ఒత్తిడిని తగ్గించుకోవడానికి 'గ్రౌండింగ్ టెక్నిక్స్' మరియు శరీరంలో 'హ్యాపీ కెమికల్స్' పెంపొందించుకోవడం వంటి పద్ధతుల ప్రాముఖ్యతను ఆమె వివరించారు. కార్యక్రమం ప్రారంభంలో CSSI కి చెందిన డాక్టర్ ఎన్. బాబావలి అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మిజోరాం యూనివర్సిటీ విద్యార్థులు ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థులతో ముఖాముఖి చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఇరు విశ్వవిద్యాలయాలకు చెందిన సుమారు 90 మంది విద్యార్థులు, పరిశోధకులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

## మన మిత్రలో ఏయూ పరీక్ష ఫలితాలు

**ఆంధ్రవిశ్వవిద్యాలయం, మార్చి 13:** ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు ఇకపై తమ పరీక్ష ఫలితాలను నేరుగా వాట్అప్ ద్వారా తెలుసుకోవచ్చని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.పి. రాజశేఖర్ అన్నారు. నేడు ఏయూ సెనేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మనమిత్ర యాప్ ద్వారా ఇకపై ఆంధ్ర విద్యాలయం విద్యార్థులు తమ పరీక్షా ఫలితాలను అత్యంత సులువుగా వాట్సప్ ద్వారా తెలుసుకునే విధంగా కార్యాచరణ చేసినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన డెమోను ప్రత్యక్షంగా చూపించారు. అనతంరం ఏయూ విద్యార్థిని వాట్సాప్ ఉపయోగించిన తన రిజిస్టర్ నెంబర్ ద్వారా ఫలితాలు పొందే విధానం లైవ్లో చూపించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె. రాంబాబు, కంప్యూటర్ సెంటర్ డీన్ ఆచార్య సి. హెచ్.వి.వి.ఎస్ భాస్కర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా ప్రోమోస్‌లో మావి వాడారు




ఐపీఎల్‌లో అత్యంత అభిమానగణం కలిగిన టీమ్ చెన్నై సూపర్ కింగ్స్. ఎంఎస్ ధోని సారథ్యంలో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచింది. మరో టైటిల్ కోసం సిద్ధమవుతోంది. ఈ క్రమంలో కాపీరైట్ ఉల్లంఘనలకు పాల్పడిందని ఆరోపిస్తూ సీఎస్‌కేపై మద్రాస్ హైకోర్టులో సన్‌టీవీ నెట్‌వర్క్ రూ. కోటికి దావా వేసింది. తమ అనుమతి లేకుండానే జైలర్, జైలర్ -2, కూలీ సినిమాల్లోని బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్, ఆడియో ట్రాక్‌లు, డైలాగులను సీఎస్‌కే తమ ప్రచార వీడియోలో వాడుకుందని పేర్కొంది. వాణిజ్యపరంగా వాటిని వాడుకోవడం కాపీరైట్ ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపింది. సదరు కంటెంట్ కాపీరైట్ రక్షణ పరిధిలో ఉందని, దానిని వినియోగించుకోవాలంటే తమ ముందస్తు అనుమతి తప్పనిసరి అని ఆ చిత్రాల నిర్మాతలు హైకోర్టుకు తెలిపారు. సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌తో తాము చేసుకున్న ఒప్పందాలను హైకోర్టుకు సమర్పించారు. "కాపీరైట్ కలిగిన తమ మెటీరియల్‌ను సీఎస్‌కే లిమిటెడ్ అనధికారికంగా వినియోగిస్తోందని పేర్కొంటూ మార్చి 1న ఈమెయిల్ పంపాం. ఆ తర్వాత ఆ సంస్థ వాటి వినియోగాన్ని నిలిపివేసింది. సంగీత దర్శకుడు అనిరుధ్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం హక్కులన్నీ మాకే చెందుతాయి. భవిష్యత్తులో ప్రతివాది నుంచి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలి" అని సన్‌టీవీ తరపున రవీంద్రన్ కోరారు. తాము ఇప్పటికే ఆ కంటెంట్‌ను నిలిపివేశామని హైకోర్టుకు చెన్నై సూపర్ కింగ్స్ తెలిపింది. ఖసన్‌టీవీ నెట్‌వర్క్ చేసిన వాదనలను, సీఎస్‌కే ఇచ్చిన తక్షణ స్పందనను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ పాటలు, సంభాషణల వినియోగానికి సంబంధించి ఏవైనా ఆంక్షలు లేదా జరిమానాలు విధించడంపై నిర్ణయం తీసుకొనే ముందు మరోసారి ఇరుపక్షాల వాదనలు వినాలని మద్రాసు హైకోర్టు నిర్ణయించింది. సన్ గ్రూప్‌నకు చెందిన సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా ఐపీఎల్‌లో పోటీపడుతోన్న సంగతి తెలిసిందే. మరోవైపు ది హండ్రెడ్ లీగ్‌లో సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు పాక్ క్రికెటర్ అబ్రార్ అహ్మద్‌ను తీసుకోవడం విమర్శలకు దారితీసింది. ఇప్పుడు సీఎస్‌కేపై సన్‌టీవీ నెట్‌వర్క్ దావా వేయడం చర్చకు దారితీసింది.

## టీ20 ప్రపంచకప్‌లో తెలివి తక్కువ జట్టు ఏదంటే..:



ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్.. దక్షిణాఫ్రికాను టీ20 వరల్డ్ కప్ 2026లో తెలివితక్కువ జట్టు అని అభివర్ణించాడు. సూపర్ 8లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఓడిపోయి ఉంటే.. భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించి ఉండేదన్నాడు. బలమైన జట్టుగా ఉన్న టీమ్‌ఇండియాను వరల్డ్‌కప్ నుంచి బయటకు పంపించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డాడు. 'మీకో విషయం చెబుతాను. ఈ టోర్నమెంట్‌లో తెలివితక్కువ జట్టు ఏదో చెప్పనా.. అది దక్షిణాఫ్రికా. ఎందుకంటే సూపర్ 8లో జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను గెలవనిస్తే.. భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించి ఉండేది. కానీ ఆ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా గెలిచి భారత్ వరల్డ్ కప్‌లో కొనసాగేందుకు అవకాశం కల్పించారు. తర్వాత టీమ్‌ఇండియా, జింబాబ్వే, వెస్టిండీస్‌లపై విజయం సాధించి సెమీఫైనల్‌కు దూసుకువెళ్లింది. అనంతరం సెమీస్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించింది' అని మైఖేల్‌వాన్ ఓ పాడ్‌కాస్ట్‌లో అన్నాడు. 'ఇలాంటివి జరగకూడదు. సాధారణంగా జరగవు కూడా. కానీ.. మీరు వరల్డ్ కప్ గెలవాలనుకుంటే.. ఉత్తమ జట్టును తొందరగానే టోర్నీ నుంచి బయటకు పంపాలి' అని అతడు విశ్లేషించాడు. టీమ్‌ఇండియా సూపర్ 8లో భాగంగా దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో 76 పరుగుల భారీ తేడాతో ఘోర ఓటమిని చవిచూసిన విషయం తెలిసిందే. దీంతో నెట్‌రన్‌రేట్ మైనస్‌కు చేరి, సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంది. ఒకరకంగా తన సెమీస్ అవకాశాలను కష్టతరం చేసుకుంది. కానీ జింబాబ్వే, వెస్టిండీస్‌లతో జరిగిన మ్యాచుల్లో విజయం సాధించి టోర్నీలో ముందుకుసాగింది. ఆఖరుకు ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి వరుసగా రెండుసార్లు టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడింది. దక్షిణాఫ్రికా మాత్రం సెమీస్‌లో న్యూజిలాండ్ చేతిలో చిత్తై టోర్నీ నుంచి నిష్క్రమించింది.

## కేకేఆర్‌లోకి వరల్డ్ కప్ బెస్ట్ బౌలర్!




ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) తమ జట్టులోకి జింబాబ్వే పేస్ సెన్సేషన్ బ్లెస్సింగ్ ముజరబానిని తీసుకుంది. బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ స్థానాన్ని ముజరబానితో భర్తీ చేసింది. ఈ విషయాన్ని కేకేఆర్ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. బ్లెస్సింగ్ ముజరబానికి స్వాగతం అంటు ఒక పోస్ట్ చేసిన కేకేఆర్.. మరో పోస్ట్‌లో టీ20 ప్రపంచకప్‌లో అతని సంచలన బౌలింగ్ వీడియోను షేర్ చేసింది. 6 అడుగుల 8 అంగుళాల పొడవున్న ముజరబాని జింబాబ్వే అత్యుత్తమ బౌలరని, తన హైట్ ద్వారా లభించే బౌన్స్‌తో వికెట్లు తీసే సామర్థ్యం అతనికి ఉందని కేకేఆర్ తమ ప్రకటనలో పేర్కొంది. అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ ఫ్రాంచైజీ లీగ్స్‌ల్లోని ఆయన అనుభవం కేకేఆర్ పేస్ విభాగాన్ని బలోపేతం చేస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడుల నేపథ్యంలో భారత్ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. బంగ్లాదేశ్ క్రికెటర్లను ఐపీఎల్‌లోకి అనుమతించవద్దంటూ పలువురు రాజకీయ నాయకులు, నెటిజన్లు అప్పట్లో డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల నేపథ్యంలో ముస్తాఫిజుర్‌ను జట్టు నుంచి తొలగించాలని కేకేఆర్‌ను బీసీసీఐ ఆదేశించింది. దాంతో ముస్తాఫిజుర్‌ను కేకేఆర్ టీమ్ నుంచి తొలగించింది.

అతని ఉద్వాసనతో ఖాళీగా ఉండిపోయిన స్థానాన్ని ముజరబానితో కేకేఆర్ భర్తీ చేసింది. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో ముజరబాని సంచలన ప్రదర్శన కనబర్చాడు. 13 వికెట్లు తీసి జింబాబ్వే సూపర్-8కు చేరడంలో కీలకపాత్ర పోషించాడు. ఓవరాల్‌గా ఇప్పటి వరకు 80 అంతర్జాతీయ టీ20ల్లో 90 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ ఆఫర్‌తో ముజరబాని పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) కాంట్రాక్ట్‌ను వదులుకున్నాడు.

## కుల్దీప్ యాదవ్ పెళ్లి.. పెళ్లి కూతురు ఎవరంటే?



టీమిండియా స్టార్ క్రికెటర్ కుల్దీప్ యాదవ్ వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నాడు. తన చిన్ననాటి స్నేహితురాలు వంశిక చద్దాను శనివారం పెళ్లి చేసుకోనున్నాడు. ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీలో వీరి వివాహం ఘనంగా జరగనుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 విజయానంతరమే కుల్దీప్ యాదవ్ పెళ్లి వార్త అందరి దృష్టిని ఆకర్షించింది. అతని కాబోయే సతీమణి గురించి తెలుసుకోవడానికి నెటిజన్లు ఆసక్తి చూపుతున్నారు. వంశిక చద్దా, కుల్దీప్ యాదవ్ చిన్ననాటి స్నేహితులు. ఇద్దరూ కాన్పూర్‌కు చెందినవారే. పాఠశాల స్థాయి నుంచి ఈ ఇద్దరి మధ్య స్నేహం ఉన్నట్లు తెలుస్తోంది. కాన్పూర్‌లోని శ్యామ్ నగర్‌లో వంశిక కుటుంబం నివసిస్తుండగా.. కుల్దీప్ యాదవ్ కుటుంబం కాన్పూర్‌లోని లాల్ బంగ్లా ప్రాంతంలో ఉంటుంది. కాలక్రమేణా వీరి స్నేహం కాస్తా ప్రేమగా మారింది. అంతర్జాతీయ క్రికెట్‌లో కుల్దీప్ యాదవ్‌కు మంచి గుర్తింపు లభించినప్పటికీ, వంశిక మాత్రం బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా సాదాసీదా జీవితాన్నే గడుపుతున్నారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com